Follow: @ANNTELUGU
10-10-2026
# మహా పత్రిక
ఏఎన్ఎన్ తెలుగు
శనివారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 259   పేజీలు-08   వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్



మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి 02

తమిళనాడులో టీవీకే హవా
బెంగాల్‌లో బీజేపీ జోరు 02



అమెరికా మనల్ని వద్దనుకుంటోంది ..తిరిగొచ్చేయండి'
భారత టెక్కీలకు శ్రీధర్ వెంబు పిలుపు 02



ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ
## కూటమి విజయం

- సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని హర్షం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) కూటమి అఖండ విజయం సాధించింది. రాష్ట్రస్థాయి గుర్తింపు సంఘంగా ఎంప్లాయిస్ యూనియన్ నిలవడంతో కార్మిక వర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ తో పాటు

మిగితా 3వ పేజీలో



ఖమ్మంలో తిరుమల తరహాలో
## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

- ఈనెల 12న అల్లిపురంలో భూమిపూజ.
- రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.

02



## ఏఎన్ఎన్ సీఈవోతో జెనివిస్ రెమెడీస్ ఛైర్మన్ భేటీ

- జనరిక్ మెడిసిన్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అధినేతకు సన్మానం

**హైదరాబాద్, మహా :** జనరిక్ మెడిసిన్ మాన్యుఫాక్చరింగ్ రంగంలో దూసుకుపోతున్న జెనివిస్ రెమెడీస్ ఛైర్మన్ సంతోష్ షెగ్డే శుక్రవారం ఏఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో తమ కంపెనీ వేగంగా దూసుకెళ్తున్నదని, పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా జెనివిస్ ఛైర్మన్ సంతోష్‌ను ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ సీఈవో కంది రామచంద్రారెడ్డి సత్కరించారు.



# ఢిల్లీలో హైటెన్షన్

దేశవ్యాప్తంగా అరెస్ట్ లు.. ఢిల్లీ నలువైపులా రోడ్లు బంద్

- రాజధానిలో ఇంటర్నెట్ బంద్.. మెట్రో బంద్
- ఎన్నికల ప్రధానాధికారి రాజీనామా డిమాండ్‌తో ఉద్రిక్తత
- 57 మెట్రో స్టేషన్లు, పలు రైళ్ల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు
- భారీగా మోహరించిన భద్రతా బలగాలు
- జెన్ జీకి భయపడుతున్న కేంద్రం- అందుకే ఢిల్లీని కోటలా

ఢిల్లీ, మహా : దేశ రాజధాని ఢిల్లీ అట్టుడుకుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), వివిధ విద్యార్థి సంఘాలు శనివారం తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శన నేపథ్యంలో రాజధానిలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అర్ధరాత్రి నుంచి ఢిల్లీ నగరాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేయనున్నారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయనున్నారు. దేశ రాజధానిలో దుకాణాలు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించారు. రాత్రి 10 గంటల నుంచి 57 మెట్రో స్టేషన్ల గేట్లను మూసివేయనున్నారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లలో పలు సర్వీసులను నిలిపివేశారు. హోటళ్లు, పీజీ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163 అమలు చేస్తున్నారు. నగరంలో ఎలాంటి నిరసనలు, ధర్నాలకు అనుమతి లేదని మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా 23 వేల మంది కేంద్ర బలగాలతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. అక్టోబర్ 10 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి

మిగితా 2వ పేజీలో



## జెన్ జీని చూసి కేంద్రం వణుకుతోంది

- ఢిల్లీ మోదీ, అమిత్ షాల ప్రైవేట్ ప్రాపర్టీ కాదు
- మెట్రో బంద్ చేసి.. ప్రజలను ఎందుకు ఇబ్బందిపెడుతున్నారు
- సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే ఫైర్

02



ఏపీ స్థానిక ఎన్నికలకు
# సుప్రీం క్లియర్

నేడు రిజర్వేషన్లపై చంద్రబాబు అత్యవసర భేటీ
ప్రభుత్వం గెజిట్ ఇస్తేనే ఎన్నికల నోటిఫికేషన్ : ఈసీ ప్రకటన

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వోన్నత న్యాయస్థానం మార్గం సుగమం చేసింది. ఏపీ హైకోర్టు విధించిన ఆరు వారాల గడువులోగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసులో కీలక ఉత్తర్వులు జారీ చేస్తూ, ఎన్నికల ఆలస్యానికి తావులేకుండా ముందుకు వెళ్లాలని ఆదేశించింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే సమయానికి 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ' ప్రక్రియ పూర్తయితే, కొత్తగా రూపొందించిన సమగ్ర ఓటర్ల జాబితా ఆధా



రంగానే ఎన్నికలు నిర్వహించాలి. ఒకవేళ నోటిఫికేషన్ సమయానికి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పూర్తి కాకపోతే, ప్రస్తుత పాత ఓటర్ల జాబితా ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేయాలని

మిగతా 2వ పేజీలో

## ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూసర్వే పూర్తి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- భూ వివాదరహిత తెలంగాణే లక్ష్యంగా ఏడు జోన్లలో 14 మంది అధికారుల పర్యవేక్షణ.

02



## రాష్ట్రపతి భవన్‌కు ర్యాలీగా..

ముర్ముకు రాహుల్, ఖర్గే, ప్రియాంక, మమత సహా కీలక నేతల ఫిర్యాదు 02

- ఈ ప్రభుత్వాన్ని తొలగించడమే పరిష్కారమని స్పష్టీకరణ
- మా ఆరోపణలను రాష్ట్రపతి తోసిపుచ్చకపోవడం ఆశ్చర్యమే: రాహుల్
- ఢిల్లీ పార్లమెంట్ ముందు విపక్ష ఎంపీల ఆందోళన








# జెన్ జీని చూసి కేంద్రం వణుకుతోంది

**ముంబై, మహా :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ అక్టోబర్ 10న భారీ ఎత్తున నిరసన నిర్వహించనున్నట్లు పిలుపునివ్వగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక్కడ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, ప్రజా రవాణాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ నిరసనను అడ్డుకోవడానికి కేంద్రం ఢిల్లీని సైనిక కోటలా మార్చిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న సీజేపీ దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇందులో భాగంగానే దిల్లీ జంతర్ మంతర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది. ఈ క్రమంలోనే బెంగళూరు నుంచి తిరుగుపయనం అవుతూ ముంబై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే. తమ నిరసనను అడ్డుకోవడానికి ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం సరికాదని, వారిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. శనివారం జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను విరమించుకోబోమని స్పష్టం చేశారు. జెన్ జీని చూసి కేంద్రం భయపడుతోందని వ్యాఖ్యలు చేసిన దీప్కే యువతను చూసి అంతగా భయపడుతుంటే దేశం మొత్తాన్ని మూసేయండని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ప్రైవేట్ ప్రాపర్టీ ఏం కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిరసనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఒకవైపు చెబుతూనే, మరోవైపు మెట్రో స్టేషన్లు, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలకు మరింత ఇబ్బంది కలగదా? అని ప్రశ్నించారు. కేంద్రం చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అభిజీత్ తెలిపారు. కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నుంచి భద్రతా బలగాలను ఢిల్లీకి ఎందుకు తరలిస్తున్నారని, యువతను పాకిస్థానీలను చూసినట్లు చూస్తుందని దీప్కే మండిపడ్డారు.

## ఏపీ స్థానిక ఎన్నికలకు

# సుప్రీం క్లియర్



(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. సీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది.

**చంద్రబాబు అధ్యక్షతన అత్యవసర భేటీ**

ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. బీసీలకు తగిన న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశంపై ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. అయితే, రాజ్యాంగ పరిధిలో బీసీలకు సాధ్యమైనంత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీల రాజ్యాంగబద్ధమైన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ అంశంపై చర్చించి తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు శనివారం అత్యవసర క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ ఏకసభ్య కమిషన్ నివేదికను క్యాబినెట్ ముందు ఉంచనున్నట్లు తెలిపారు. కమిషన్ నివేదిక, సుప్రీంకోర్టు తీర్పు, రాజ్యాంగ నిబంధనలను సమగ్రంగా పరిశీలించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ప్రభుత్వం గెజిట్ ఇస్తే నోటిఫికేషన్**

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనిల్ చంద్ర పునేతా కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే, ఆ తర్వాత ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 'సర్' ప్రక్రియ తర్వాత చేపట్టిన ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు ఖరారైతే రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఆ తర్వాతే స్థానిక నోటిఫికేషన్ ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనల ఆధారంగా ఈ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉంటామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేతా స్పష్టం చేశారు.

# తమిళనాడులో టీవీకే హవా

- **బెంగాల్ లో బీజేపీ జోరు**



**మహా** : దేశవ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీలు సత్తా చాటాయి. బెంగాల్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ విజయం సాధించగా, తమిళనాడులో టీవీకే పార్టీ హవా కొనసాగింది. అసోంలో ఓ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కమలదళం జయభేరి మోగించింది. పుదుచ్చేరి ఉపఎన్నికలో బీజేపీ మిత్రపక్షం ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. తమిళనాడు ఉపఎన్నికల్లో అధికార టీవీకే పార్టీ తమ హవా కొనసాగించింది. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంది. ధారాపురంలో 9 వేలకు పైగా ఓట్ల తేడాతో టీవీకే అభ్యర్థి సత్యభామ విజయం సాధించారు. మధురాంతకంలో 15 వేలకు పైగా ఓట్ల తేడాతో డీఎంకే అభ్యర్థి పరంతమన్‌పై టీవీకే అభ్యర్థి మరకతం గెలుపొందారు. తమిళనాడు ఉప ఎన్నికల ఫలితాలపై స్పందించిన విజయ్, టీవీకే పార్టీ పట్ల ప్రజలకు ఉన్న అభిమానం, ప్రజాస్వామ్యం పట్ల ఉన్న నిబద్ధతను ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. ఈ విజయం మహిళలను కించపరిచే నేతలకు, వెన్నుపోటు రాజకీయాలకు ప్రజలిచ్చిన బలమైన తీర్పు అని అభివర్ణించారు. ఈ గెలుపు తమపై ఉన్న బాధ్యతను మరింత పెంచిందని విజయ్ వెల్లడించారు. బెంగాల్, అసోంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలను కమలదళం సొంతం చేసుకుంది. నందిగ్రామ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ 1.22 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌పై గెలిచారు.

# ఢిల్లీలో హైటెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

నిరాకరించారు. అయితే, తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టును సీజేపీ ఆశ్రయించింది. దీనిపై నేడు విచారణ జరిపిన ధర్మాసనం.. శాంతియుత నిరసనలకు జంతర్ మంతర్ కాకుండా మరోచోట అనుమతి ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైన మేరకే నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొంటూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు దేశవ్యాప్తంగా విద్యార్థుల అరెస్ట్ లు కొనసాగుతున్నాయి. రైళ్ళను తనిఖీచేస్తూ విద్యార్థులను దింపివేస్తున్నారు.

**కేజ్రీవాల్ మద్దతు**

ఈ ఆందోళనకు ఆమ్ ఆద్మీ పార్టీతో సహా పలు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ప్రకటించడంతో పాటు, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ కుటుంబ సమేతంగా పాల్గొంటామని ప్రకటించడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికార యంత్రాంగం నగరంలో కఠిన ఆంక్షలు అమలు చేస్తూ, భారీ పోలీసు బలగాలను మోహరించింది. నిరసనల కోసం జంతర్ మంతర్ ప్రాంతాన్ని కేటాయించాలని నిర్వాహకులు కోరినప్పటికీ, ఢిల్లీ పోలీసులు దానికి అనుమతి నిరాకరించారు. ఆలస్యంగా దరఖాస్తు చేసుకోవడం, గత ఆందోళనల్లో నిబంధనలు ఉల్లంఘించిన చరిత్ర ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాయింట్ సీపీ నూపుర్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్‌తో పాటు జనపథ్‌కర్తవ్య పథ్ కూడలి పరిసరాల్లో భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




**మొబైల్ ఇంటర్నెట్ బంద్.. రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం**

శాంతిభద్రతల పరిరక్షణ, అవాంఛనీయ వదంతుల నివారణ చర్యల్లో భాగంగా సెంట్రల్ ఢిల్లీ పరిధిలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు 24 గంటల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. మరోవైపు, భద్రతా కారణాలరీత్యా 57 మెట్రో స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌ను పోలీసులు కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే పలు మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడం లేదా రీషెడ్యూల్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బట్లు ఎదుర్కొంటున్నారు.

**సుప్రీంకోర్టు జోక్యం.. కేంద్రం అత్యున్నత సమీక్ష**

నిరసనల పేరుతో ప్రజా రవాణా వ్యవస్థను పూర్తిగా స్తంభింపజేయడంపై సుప్రీంకోర్టు శుక్రవారం స్పందిస్తూ కీలక సూచనలు చేసింది. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా రవాణా సేవలను కొనసాగించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. మరోవైపు, ఈ పరిణామాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నగరవ్యాప్తంగా దాదాపు 25 వేల నుంచి 40 వేల మంది వరకు పారామిలటరీ, పోలీసు బలగాలను రంగంలోకి దించారు. రాజధానిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బస్సు టెర్మినళ్లు, హోటళ్లు, వసతి గృహాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు తమ ప్రయాణాలకు ముందే తాజా పరిస్థితులను బేరీజు వేసుకుని తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

# రాష్ట్రపతి భవన్‌కు ర్యాలీగా..

**ఢిల్లీ, మహా** : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఇండీ కూటమి నేతలు సమావేశమయ్యారు. ఎస్ఐఆర్, సీఈసీ వ్యవహారంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. ఇండీ కూటమికి చెందిన 10 మంది నేతలు రాష్ట్రపతిని కలిసి సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, సర్ పరిణామాలు, ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలపై ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతిని కలిసిన నేతల్లో మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, సుప్రియ సూలే, ఎంఏ బేబీ, మనోజ్ ఝా, డి రాజా, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, రాజీవ్ రాయ్, తురుమవలన్ ఉన్నారు. మరోవైపు విజయ్ చౌక్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ సహా ఇండీ కూటమి ఎంపీలు పాల్గొన్నారు. నేలపై కూర్చుని సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు పార్లమెంటు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో సమావేశమైన ఇండియా కూటమి నేతలు పార్లమెంటు నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ సహా పలువురు మహిళా నేతలు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. అయితే మార్గమధ్యలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులతో కూటమి నేతలు వాగ్వాదానికి దిగారు.



ప్రస్తుత ప్రభుత్వాన్ని తొలగించడమే పరిష్కారం : రాహుల్ గాంధీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కంటే చాలా ముఖ్యమైన సమస్య ఇంకోటి ఉందని, దానికి ప్రస్తుత ప్రభుత్వాన్ని తొలగించడమే పరిష్కారమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. గత కొన్ని రోజులుగా ప్రతిపక్షం చేస్తున్న ఒత్తిడిని ఇలానే కొనసాగిస్తే ప్రభుత్వం కూలిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల నిరసనలు ఈ ప్రభుత్వ పునాదులను కదిలించాయని, ప్రభుత్వం ఇప్పుడు భయపడుతోందన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ కేవలం ఒక 'సర్వీస్ ప్రొవైడర్' మాత్రమేనని, ప్రజలచే ఎన్నుకున్న ప్రతినిధులను కలవనని చెప్పే ధైర్యం ఆయనకు ఎలా వచ్చిందని గాంధీ ప్రశ్నించారు. ఓట్ల చోరీ జరుగుతోందన్న తమ ఆరోపణలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తోసిపుచ్చకపోవడం ఆశ్చర్యం కలిగించిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలు సమర్పించాలని ఆమె కోరినట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై ఇండీ కూటమి నేతలు శుక్రవారం రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూసర్వే పూర్తి

**హైదరాబాద్, మహా**: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమగ్ర భూసర్వే నిర్వహిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సర్వే పురోగతి, భూవివాదాల పరిష్కారంపై ఆయన సమీక్షించారు. రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూసర్వేను పూర్తిగా ముగించాలని అధికారులను ఆదేశించారు. సర్వే పర్యవేక్షణ బాధ్యతలను మరింత పకడ్బందీగా నిర్వర్తించేందుకు ఏడు జోన్ల పరిధిలో ప్రత్యేకంగా 14 మంది సీనియర్ అధికారులను నియమించినట్లు ఆయన స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి ఏమైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని గుర్తించి తగిన పత్రాల ఆధారంగా సరిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ సర్వే పేరుతో ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలి దశలో ఎంపిక చేసిన 2,768 రెవెన్యూ గ్రామాల్లో సర్వేను ముమ్మరం చేసి, నవంబరు చివరి నాటికి మొదటి దశను విజయవంతంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**ఎర్రవల్లి భూముల రికార్డులపై ప్రత్యేక దృష్టి..**

సిద్ధిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి పరిధిలో ఉన్న భూముల రికార్డులపై మరోసారి విచారణ చేపట్టారు. ఈ ప్రాంతంలోని సర్వే నంబరు 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాల భూమి ఉండగా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. ఈ 45 ఎకరాల వ్యత్యాసానికి గల అసలు కారణాలను తేల్చేందుకు అధికారులు మరోసారి నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. గతంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల చేతుల్లోకి వెళ్లిన అంశంపై కూడా ప్రభుత్వం తీవ్రంగా దృష్టి సారించింది. అసలు పట్టాదారులు ఎవరనేది పరిశీలించి వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని, ఒకవేళ అక్రమంగా భూములు బదిలీ అయినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెందాల్సిన అసైన్డ్ భూములు ఎక్కడైనా అన్యాక్రాంతమైనట్లు తేలితే, వాటిని వెనక్కి తీసుకొని అర్హులైన పేదలకు పంపిణీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. ఈ సమగ్ర భూసర్వే ద్వారా రాష్ట్రంలో భూ వివాదాలను పూర్తిగా రూపుమాపి, పారదర్శకమైన రెవెన్యూ పాలనను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఉద్ఘాటించారు.



# మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు

**తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆటపాటలతో వైభవంగా బతుకమ్మ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ప్రత్యేకతని గుర్తుచేశారు. సామూహిక జీవన విధానం, ఐక్యతకు పండుగ నిలువెత్తు నిదర్శనమన్నారు.

# అమెరికా మనల్ని వద్దనుకుంటోంది ..తిరిగొచ్చేయండి'

**మహా** : అమెరికాలో గ్రీన్‌కార్డుల ప్రక్రియకు సంబంధించి భారతీయ ఐటీ కంపెనీలపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో పనిచేస్తున్న భారతీయ టెక్కీలు స్వదేశానికి తిరిగి రావాలని పిలుపునిచ్చారు. అమెరికా సాంకేతిక అభివృద్ధిలో భారతీయులు ఎంతో కీలక పాత్ర పోషించారని, అయినా అక్కడి ప్రజల్లో మెజారిటీ వర్గం ఇప్పుడు భారతీయులను కోరుకోవడం లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు తిరిగొచ్చి దేశ భవిష్యత్తును నిర్మించడంలో భాగస్వాములు కావాలని సూచించారు. అమెరికాలో వీసాలపై పనిచేస్తున్న భారతీయులు ఎంతో కష్టపడి నిర్మించుకున్న జీవితాలను వదులుకోవాల్సిన పరిస్థితి ఎదురుకావడం బాధాకరమని వెంబు పేర్కొన్నారు. ఈ పరిణామాన్ని కొత్త భవిష్యత్తుకు నాందిగా చూడాలని అన్నారు. 'తిరిగి రండి.. మన దేశాన్ని మనమే నిర్మించుకుందాం' అంటూ 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. అమెరికా కార్మిక శాఖ ఇటీవల పలు భారతీయ ఐటీ సంస్థలతో పాటు అంతర్జాతీయ కంపెనీలను ప్రోగ్రాం ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్ మెంట్ (పీఈఆర్ఎం) 'పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్' కార్యక్రమం నుంచి సస్పెండ్ చేసింది. ఈ జాబితాలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్‌తో పాటు కాగ్నిజెంట్, క్యాప్‌జెమినీ, మైక్రోసాఫ్ట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. ఈ కార్యక్రమం అమెరికాలో కంపెనీల ద్వారా గ్రీన్‌కార్డు పొందే ప్రక్రియలో కీలకమైనది. విదేశీ ఉద్యోగులను శాశ్వతంగా నియమించుకునే ముందు సంబంధిత ఉద్యోగానికి అర్హులైన అమెరికా కార్మికులు అందుబాటులో లేరని కంపెనీలు నిరూపించాల్సి ఉంటుంది. అయితే, ఈ సంస్థలు పీఈఆర్ఎం విధానాన్ని దుర్వినియోగం చేశాయని అమెరికా కార్మిక శాఖ ఆరోపించింది. కొత్త దరఖాస్తులను స్వీకరించబోమని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపైనా ముందుకు వెళ్లబోమని కార్మిక శాఖ కార్యదర్శి కీత్ సాండర్లింగ్ ప్రకటించారు. ఈ సస్పెన్షన్ కారణంగా ప్రభావిత సంస్థలు కొత్త పీఈఆర్ఎం దరఖాస్తులు దాఖలు చేయలేవు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు కూడా నిలిచిపోతాయి. అయితే, దీనివల్ల హెచ్ 1బీ వీసాలు ఆటోమేటిక్‌గా రద్దు కావు. ఆ వీసాలపై ఉద్యోగులను నియమించుకోవడంపైనా నేరుగా నిషేధం విధించినట్లు కాదు. భారతీయులు స్వదేశానికి తిరిగి రావాలని వెంబు పిలుపునివ్వడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మేలోనూ అమెరికా గ్రీన్‌కార్డు విధానంలో మార్పుల నేపథ్యంలో వీసాలపై అక్కడ పనిచేస్తున్న భారతీయులు స్వదేశానికి రావాలని కోరారు. తాజాగా ఐటీ కంపెనీలపై చర్యల నేపథ్యంలో ఆయన మరోసారి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో తిరుమల తరహాలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

- **ఈనెల 12న అల్లిపురంలో భూమిపూజ.**
- **రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.**

**ఖమ్మం, మహా.** ఖమ్మం నగరంలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులతో కలిసి మంత్రి భూమిపూజ ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీ సోమవారం అల్లిపురంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం జరగనుందని తెలిపారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి చేతుల మీదుగా ఈ పవిత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దేవదేవుని ఆశీస్సులతో ఖమ్మం నగరంలో స్వామివారి ఆలయం రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషకరమని, ఆలయ నిర్మాణం మరియు నిర్వహణ బాధ్యత పూర్తిగా తిరుమల తిరుపతి దేవస్థానానిదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు ఖమ్మం నగరంలోనూ టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. భక్తిభావం ఉట్టిపడేలా అన్ని ఏర్పాట్లు చేయాలని, పూజా కార్యక్రమాలకు అవసరమైన విస్తృత ఏర్పాట్లు చేపట్టి ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తిరుమలలో అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకుని భక్తుల రాకపోకలకు అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రద్దీ నియంత్రణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భూమిపూజకు ఎంతమంది భక్తులు వచ్చినా అందరికీ నాణ్యమైన భోజనం, పులిహోర అందేలా దూరంగా భోజన కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రసాద పంపిణీ కౌంటర్లు పెంచాలని తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీటి కేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా నాలుగు వైపులా పార్కింగ్ స్థలాలను గుర్తించి, మ్యాప్‌లతో సహా ముందుగానే సమాచారం ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. పుష్కరాల తరహాలో వైద్య సేవలు, అగ్నిమాపక వాహనాలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లను సిద్ధం చేయాలని చెప్పారు. నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, పాత్రికేయులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ భూమిపూజ కార్యక్రమానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరగడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లకు పోలీస్ శాఖ తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ, కార్యక్రమం ముగిసే వరకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అంబరాన్నింటిన బతుకమ్మ సంబరాలు

- కళాశాల మైదానంలో బతుకమ్మను పేర్చి, ఆడి, ఆనందించిన మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు
- శుభాకాంక్షలు తెలియజేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్

**బెల్లంపల్లి,మహా** : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలలో భాగమైన బతుకమ్మ పండుగ సంబరాలు శుక్రవారం బెల్లంపల్లి డిగ్రీ & పీజీ కళాశాలలో అంబరాన్నంటాయి. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ..ఆటపాటలతో ఆకట్టుకున్న వేడుక..ముందస్తు బతుకమ్మ సంబరాల కోసం కళాశాల మైదానంలో పెద్ద ఎత్తున షామియానా ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం ప్రిన్సిపాల్ మరియు ఇతర అధ్యాపకులు కొబ్బరికాయలు కొట్టి బతుకమ్మ ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు, విద్యార్థులు అందరూ కూడా బతుకమ్మ ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. వెళ్లి రా బతుకమ్మ.. మళ్లీ రా బతుకమ్మ.. అంటూ ఆటపాటలతో హోరెత్తించారు. బతుకమ్మ పాటలకు తగ్గట్టుగా నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను స్థానిక పోచమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ ఎంఏ రేష్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్ పుప్పాల శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల ప్రశాంతం

- ఎస్డబ్ల్యుఎఫ్ కూటమి ఘన విజయం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: కొత్తగూడెం ఆర్టిసి డిపో పరిధిలో శుక్రవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్ డబ్ల్యూఎఫ్) తెలంగాణ వర్కర్స్ యూనియన్(టీ డబ్ల్యూయు) కూటమి ఘన విజయం సాధించింది. డిపో పరిధిలో ఉన్న 176 ఓట్లకు గాను 173 ఓట్లు పోలయ్యాయి. ఇందులో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్ డబ్ల్యూఎఫ్ ) సంఘంకు 112 ఓట్లు పోలయ్యాయి. నేషనల్ మజ్దూర్ యూనియన్ సంఘానికి 58 కోట్లు పోలుకగా ఒక ఓటు చక్రం గుర్తుకు, ఒక ఓటు త్రాసు గుర్తుకు నమోదు అయింది. ఒక ఓటు చెల్లకుండా పోయింది. 112 ఓట్ల అత్యధిక మెజార్టీతో స్టాఫ్ నుండి వర్కర్స్ ఫెడరేషన్ విజయం సాధించింది. ఉదయం 5 గంటల నుండి ప్రారంభమైన ఓటింగ్ సరళి సాయంత్రం వరకు 6 గంటల వరకు సాగింది. రాత్రి 6 గంటల 30 నిమిషాల నుండి కార్మిక శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. కొత్తగూడెం డిపో కార్యాలయంలో ఓట్ల లెక్కింపు జరిగింది. ఈ ఓట్ల లెక్కింపులో మొత్తం 173 ఓట్లు పోలైనట్టు అధికారులు వెల్లడించారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ కు 112, ఎన్ఎంయుపి 58, ఓట్లు ఒక ఓటు చెల్లకుండా పోయింది.. ఒక ఓటు చక్రం గుర్తుకి, ఒక ఓటు త్రాసు గుర్తుకి పోలైనట్లు అధికారులు తెలిపారు.

**విజయోత్సవం**

ఐక్య కార్మిక సంఘాల కూటమి ఆధ్వర్యంలో సాధించిన విజయాన్ని కార్మిక విజయంగా భావిస్తూ డిపో ఆవరణలో గెలుపు ఉత్సవాలను అంబరాన్ని అంటే విధంగా సంబరాలు జరుపుకున్నారు. ఎరుపు రంగు చల్లుకుంటూ బాణాసంచ కాల్చి విజయోత్సవం ర్యాలీ నిర్వహించారు. డిపో ప్రాంగణంలో డప్పు వాయిద్యాలు నృత్యం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, కాంగ్రెస్, సిఐటియు, ఐఎన్టియుసి ఐక్య కూటమి నాయకులు బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి విజయోత్సవాలను జరుపుకున్నారు.

# కియా కార్లపై అదిరిపోయే ఆఫర్

**హైదరాబాద్, మహా:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా ఇండియా, తమ వినియోగదారులకు ఓ అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. తన ప్రజాదరణ పొందిన 'అష్యూర్డ్ బైబ్యాక్ ప్రోగ్రామ్' పరిధిని మరింత విస్తరించింది. ఈ పథకం కింద, కియా కారు కొనుగోలు చేసిన కస్టమర్లు తమ వాహనం రీసేల్ వాల్యూ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిర్ణీత గడువు తర్వాత కంపెనీయే ఆ కారును తిరిగి కొనుగోలు చేసి, దాని విలువలో గణనీయమైన మొత్తాన్ని యజమానికి తిరిగి చెల్లిస్తుంది. ఈ విస్తరించిన పథకం ప్రకారం, పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ వంటి ఇంటర్నల్ కంబశ్చన్ ఇంజిన్ మోడళ్లపై మూడేళ్ల తర్వాత 75% వరకు అష్యూర్డ్ బైబ్యాక్ విలువను కియా అందిస్తోంది. అదే సమయంలో, ఎలక్ట్రిక్ వాహనాల పై మూడేళ్ల తర్వాత 70% వరకు బైబ్యాక్ విలువకు హామీ ఇస్తోంది. గతంలో సైరోస్ ఈవీ లాంచ్ సందర్భంగా 80% వరకు బైబ్యాక్ ప్రకటించినప్పటికీ, విస్తరించిన ప్రోగ్రామ్‌లో భాగంగా దీన్ని 70%కి సవరించారు.

**ఏయే మోడళ్లకు వర్తిస్తుంది?**

ఈ అష్యూర్డ్ బైబ్యాక్ ప్రోగ్రామ్ కియా లైనప్‌లోని సోనెట్, సైరోస్, సెల్టోస్, కారెన్స్, కారెన్స్ క్లావిస్, సొరెంటో వంటి ప్రముఖ మోడళ్లకు అందుబాటులో ఉంటుంది. అయితే, పూర్తిగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే కార్నివాల్, ఈవీ9, ఈవీ6 మోడళ్లకు ఈ పథకం వర్తించదు. వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా కాలపరిమితి, మైలేజ్ ఆప్షన్లను ఎంచుకోవచ్చు. ఐసీఈ మోడళ్లకు 3, 4, లేదా 5 సంవత్సరాల కాలపరిమితి ఆప్షన్లు ఉండగా, ఎలక్ట్రిక్ వాహనాలకు 3 లేదా 4 సంవత్సరాల ఆప్షన్లు ఉన్నాయి. ఏడాదికి 10,000, 15,000, లేదా 20,000 కిలోమీటర్ల మైలేజ్ పరిమితిని ఎంచుకోవచ్చు. మొత్తం ఓనర్‌షిప్ వ్యవధిలో గరిష్ఠంగా లక్ష కిలోమీటర్ల వరకు ఇది వర్తిస్తుంది. ఈ పథకంపై కియా ఇండియా సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడుతూ.. "వినియోగదారులకు తమ వాహనం భవిష్యత్ విలువపై ఒక స్పష్టమైన భరోసా ఇవ్వడానికే ఈ ప్రోగ్రామ్‌ను రూపొందించాం. దీనివల్ల వారు సులభంగా తమ పాత కారు నుంచి కొత్త కియా మోడల్‌కు అప్‌గ్రేడ్ కాగలుగుతారు" అని వివరించారు. కారు కొనుగోలు చేసే సమయంలోనే అధీకృత కియా డీలర్‌షిప్‌ల వద్ద ఈ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు.

# టేఖేదారుల పై వరంగల్ సీపీ నజర్ స్టేషన్ల పై నిఘా

**వరంగల్ ట్రాఫిక్ లో అసలు సూత్రధారిని తప్పించింది ఎవరు?**

**వరంగల్,బ్యూరో మహా ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లలో టేఖేదారుల వసూళ్ల పై వరంగల్ సీపీ నజర్ పెట్టారని సమాచారం. నెల నెల వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నట్లు గా ఆరోపణలు వచ్చిన పోలీస్ స్టేషన్ల పై నిఘా వర్గాలు కన్నేశాయి. ఇదే సమయంలో వరంగల్ ట్రాఫిక్ విభాగంలో గత కొంతకాలంగా అధికారికి అండగా ఉండి రెండు వైపులా వసూళ్ల పర్వం కొనసాగించిన అసలు సూత్రధారిని తప్పించారని ఆ శాఖలోని సిబ్బంది మధ్య గుసగుసలు వినబడుతున్నాయి. గత కొంతకాలంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో టేఖేదారుల రాజ్యం నడుస్తోందనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. స్టేషన్ లలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు, టేఖేదారులు చక్రం తిప్పుతున్నారని, దళారుల వ్యవస్థతో సామాన్యుల నుండి వసూళ్లకు పాల్పడు తున్నారనే ఫిర్యాదులు సీపీ దృష్టికి వెళ్లాయని సమాచారం. దీంతో సీపీ వెంటనే ఆయా స్టేషన్ల పై నిఘా వర్గాలను పెట్టి, ఎవరెవరు టేఖేదారులతో సంబంధాలు పెట్టుకున్నారో ఆరా తీయాలని నిఘా వర్గాలను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ హోంగార్డు గత కొన్ని సంవత్సరాలుగా ట్రాఫిక్ విభాగం, మట్వాడ పోలీస్ స్టేషన్, ఆర్టిఓ శాఖలో మితిమీరిన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రమంలో ఇతని పై విచారణకు ఆదేశించి ఆరోపణలు నిజం కావడంతో అతనిని గత నెల రోజులుగా విధుల నుంచి తాత్కాలికంగా బహిష్కరించినట్లు విశ్వసనీయ సమాచారం. వరంగల్ సబ్ డివిజన్ లోని ఓ పోలీస్ స్టేషన్ గత రెండు నెలలుగా మూగబోయింది. మరోవైపు హనుమకొండ నగర శివారులో ఉన్న ఓ పోలీస్ స్టేషన్ లో ముగ్గురు కానిస్టేబుళ్ల అక్రమ వసూళ్ల హవా కొనసాగుతుందని విశ్వసనీయ సమాచారం. మరోవైపు ట్రాఫిక్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమ వసూళ్ల పై కూడా సీపీ నజర్ పెట్టారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన కొన్ని ఘటనల్లో అసలు సూత్రధారిని తప్పించి, కింది స్థాయి సిబ్బంది పై వేటు వేసే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాఫిక్ రూల్స్ పేరుతో జరుగుతున్న వసూళ్ల వెనుక పెద్ద తలకాయలు ఉన్నాయని, ఆ పెద్దలను కాపాడేందుకు ఓ అధికారి రంగంలోకి దిగి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని పోలీస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. సీపీ మాత్రం ఎవరినీ వదిలేది లేదని, టేఖేదారుల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని, ట్రాఫిక్ విభాగంలో వసూల్ రాజాలు ఎవరైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- కొత్తగా మంజూరైన ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ త్వరగా పూర్తి చేయాలి
- పురోగతి లేని ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి మహా** : జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హౌసింగ్ అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను త్వరితగతిన అందజేసి, నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రొసీడింగ్స్ అందుకున్న లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పురోగతి లేని ఇళ్లపై ప్రత్యేక దృష్టి**

మొదటి జాబితాలో మంజూరైన ఇళ్లలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించని వాటిని గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలను తెలుసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**మార్కింగ్ పూర్తికాని ఇళ్లను గుర్తించాలి**

మొదటి జాబితాలో ఇప్పటివరకు మార్కింగ్ పూర్తికాని ఇళ్లను క్షేత్రస్థాయిలో గుర్తించి, వెంటనే మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కింగ్ పూర్తయిన ఇళ్లలో నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ పనులు ప్రారంభించేలా చూడాలని పేర్కొన్నారు.

**నిర్మాణ పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ**

ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వివరాలను సేకరించి, ప్రతి ఇంటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను వివరించి, ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డిప్యూటీ ఈఈ దస్తగిరి, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యువత ఆన్లైన్ మోసాల బారిన పడొద్దు



**భీమారం మహా ;** భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ , మన సంస్కృతి, సాంప్రదాయ విలువలను మనమందరం కాపాడుకోవాలని మంచి చెడుల మధ్య తేడాను గుర్తిస్తూ, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని ముఖ్యంగా కుటుంబ సభ్యులందరికీ సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ పిలుపునిచ్చారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని తమ విలువైన భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. అక్టోబర్ నెలను జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన నెలగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భీమారం లోని ఎస్వీఎస్ కళాశాల ఆడిటోరియంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించబోయే వ్యక్తులు మీరేనని, ప్రస్తుతం మీరు ఉన్న వయస్సు జీవితానికి అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ దశలోనే ప్రతి ఒక్కరూ అవసరమైన అవగాహనను పెంపొందించుకోవాలని, పాటించే విలువలు, అలవాట్లు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులను గుడ్డిగా నమ్మకూడదని సూచించారు. కొందరు సైబర్ నేరగాళ్లు భావోద్వేగాలను ఆసరాగా చేసుకొని వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని సేకరించి బాధితులను బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఆన్‌లైన్ లో పరిచయమైన వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, మంచి చెడుల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి ఆలోచనాత్మకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రానున్న దసరా సెలవులను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డిజిటల్ భద్రతా నియమాలను పాటిస్తూ సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ, కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సైబర్ క్రైమ్ ఎస్ఐ శివకుమార్, ఎస్వీఎస్ కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# జోగుళాంబ అమ్మవారి కల్యాణోత్సవానికి సీఎం కి ఆహ్వానం

**హైదరాబాద్, మహా .** జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో ఈ నెల 16న అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ జోగుళాంబ అమ్మవారి కల్యాణోత్సవానికి విచ్చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హన్మంతరావు, గద్వాల సంస్థాన వారసుడు కృష్ణ రామభూపాల్, ఆలయ ఈవో దీప్తి తదితరులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఈ సందర్భంగా అమ్మవారి తీర్థప్రసాదాలను ముఖ్యమంత్రికి సమర్పించి, ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను వివరించారు. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ శక్తిక్షేత్రాల్లో ఒకటైన అలంపూర్‌లో జరిగే ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ కూటమి విజయం

( మొదటి పేజీ తరువాయి )

నేషనల్ మజ్దూర్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ సంఘాలు కలిసికట్టుగా కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈ ఐక్యతతో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించి, ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తమకున్న పట్టును మరోసారి నిరూపించుకున్నాయి. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి భారీ విజయం సాధించడం పట్ల సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఈయూ కూటమి నిరంతరం పోరాడుతుందని, ఈ విజయం కార్మిక శక్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఆర్టీసీ కార్మికులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. విజయానంతరం యూనియన్ కార్యాలయాల వద్ద కార్మికులు భారీ ఎత్తున టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.

# అల్లి కనకమ్మ జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: అల్లి కనకమ్మ చూపిన ప్రేమ అనురాగాలు మంచితనం మానవత్వం వీటన్నిటిని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. ఫ్యూన్ బస్తీలోని శుక్రవారం దివంగత అల్లి కనకమ్మ దశదినకర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఎమ్మెల్యే కూనంనేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకమ్మ సేవలను కొనియాడారు. ఇదిలా ఉండగా మిమిక్రీ రమేష్, అల్లి శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, కలవల రాందాస్, మారపాక కృష్ణస్వామి, తాండూరు ధనరాజ్ వీరంతా గొప్ప కళాకారులని తన విజయం వెనుక వీరి కృషి ఎంతో ఉన్నదని అందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ "కళాభారతి" కళాకారుల భవన నిర్మాణాన్ని తప్పకుండా ఏర్పాటు చేస్తానని వృద్ధ కళాకారులకు నిరుద్యోగ కళాకారులకు తప్పకుండా పెన్షన్స్ మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, ఒకటవ టౌన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ జితేందర్, ప్రముఖ డాక్టర్ అల్లూరి నాగరాజు, అపరబాలు అల్లి శంకర్, ఆచార్య డాక్టర్ మద్దెల శివ కుమార్, హైదరాబాదు నుండి ప్రత్యేకంగా విచ్చేసిన అంతర్జాతీయ మిమిక్రీ ధ్వని అనుకరణ చక్రవర్తి జల్లారపు రమేష్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ వెంకట రాముడు, కార్పొరేటర్లు తలుగు అనిల్ కుమార్, కనుకుంట్ల శ్రీను(కేకే), ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంతోటి పాల్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, భూపతి అశోక్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ ఆరిఫ్ ఖాన్, ప్రముఖ కళాకారులు ప్రముఖ సంగీత దర్శకులు అపర ఇళయరాజా, మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, ప్రముఖ సీనియర్ కీబోర్డు ప్లేయర్ సిహెచ్ జాన్ రత్నం, వర్ధమాన సినీ సంగీత దర్శకులు సలవాది విజయ్, ప్రముఖ రిథమిస్ట్ వైదేవ సహాయం, ప్రముఖ రిథమ్ ప్యాడ్ ప్లేయర్ సంగీతరావు, గాయకులు సబ్బారపు కృష్ణ, ప్రముఖ రిథమిస్ట్ రంజిత్, టేప్ ఆర్టిస్ట్ శ్రీనివాసరావు, ప్రముఖ క్రీస్తు సువార్తికులు కేదాసి పీటర్ బాబు, మాతంగి నరసయ్య, కోటేశ్వరరావు, ఉల్లోజు వెంకట్, మద్దెల వెంకటయ్య, మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, ప్రముఖ సామాజిక జానపద గాయకులు చింతల కనకయ్య, కన్నం చంద్రయ్య, సముద్రాల శ్రీనివాస్, శ్రీనివాస్, అల్లి రమేష్, కుటుంబ సభ్యులు అల్లి మల్లయ్య, అల్లి హనుమంతు, అల్లి రాఘవులు, అల్లి సన్నీ, అల్లి పవన్, అల్లి ప్రశాంత్, మనుమరాండ్రు మనుమల్లు పాల్గొన్నారు.

# భవానీ దీక్షలో కేంద్ర మంత్రి బండి సంజయ్

- కరీంనగర్ మహాశక్తి ఆలయంలో మాలధారణ

**కరీంనగర్, మహా :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ భవానీ దీక్షను స్వీకరించారు. కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో శుక్రవారం వేద పండితుల ఆశీర్వచనాల మధ్య సంప్రదాయబద్ధంగా మాలధారణ చేశారు. 11 రోజులపాటు దీక్షలో కొనసాగనున్న ఆయన దసరా వరకు ఆలయంలోనే ఉంటూ అమ్మవారి సేవలో పాల్గొనడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు ఆయన వర్గాలు వెల్లడించాయి.

**మహాశక్తి ఆలయంలో మాలధారణ**

**ద పండితుల ఆశీర్వచనాల మధ్య దీక్ష**: కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో బండి సంజయ్ భవానీ మాలధారణ చేశారు. వేద పండితులు సంప్రదాయబద్ధంగా ఆశీర్వచనాలు అందించారు. భవానీ దీక్షను స్వీకరించిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన వర్గాలు తెలిపాయి.





**11 రోజులపాటు దీక్ష**

**అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి**: భవానీ దీక్షలో భాగంగా 11 రోజులపాటు నియమ నిష్ఠలతో గడపనున్నట్లు వెల్లడించారు. ఈ కాలంలో అమ్మవారి పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. దసరా వరకు ఆలయంలోనే ఉంటూ భక్తి కార్యక్రమాలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన వర్గాలు తెలిపాయి.

**ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై **దృష్టి**: దీక్ష సమయంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజల సమస్యలు, నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై అందుబాటులో ఉంటారని ఆయన వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రజలను కలిసే సమయాలు, ఇతర కార్యక్రమాల వివరాలు ప్రత్యేకంగా వెల్లడించలేదు.

**భవానీ దీక్షకు ఆధ్యాత్మిక ప్రాధాన్యం**

**నియమ నిష్ఠలతో ఆరాధన**: భవానీ దీక్షను భక్తులు అమ్మవారి ఆరాధనలో భాగంగా స్వీకరిస్తారు. దీక్షా కాలంలో నియమాలను పాటిస్తూ పూజలు నిర్వహించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కరీంనగర్ మహాశక్తి ఆలయంలో మాలధారణ చేయడం స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ANN తెలుగు

మహా పత్రిక

శనివారం, హైదరాబాద్

10-10-2026



# ఆకలి కేకల నుంచి అక్షర జాతర వైపు

కొడంగల్ బడుల్లో అల్పాహార మహా విప్లవం
నిబద్ధతతో అమలుచేస్తున్న హరే కృష్ణ
మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్

60 బడుల్లో 1,525 మంది విద్యార్థులు అదనం.
హాజరులో 20–22 శాతం పెరుగుదల.
అల్పాహార పథకానికి ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు

## గొప్ప లక్ష్యంతో..

"తెలంగాణలో ఏ విద్యార్థి కూడా ఖాళీ కడుపుతో పాఠశాలకు వెళ్లకూడదు" అని గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. ఈ నిర్ణయం ఒక గొప్ప లక్ష్యంగా మారి తెలంగాణ స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అమలు చేసే అవకాశం హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కు ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ 20 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందుతుంది. ఈ స్థాయిలో విద్యార్థులకు ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమం భారతదేశంలోనే ప్రత్యేకమైనది. భవిష్యత్తులో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌గా నిలిచే అవకాశం ఉంది. మా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ వంటశాలల్లో ప్రత్యేకంగా రూపొందించిన యంత్రాలను ఉపయోగిస్తూ, మా సిబ్బంది ప్రతిరోజూ ఉదయం వేడి, తాజా, పరిశుభ్రమైన అల్పాహారాన్ని లక్షలాది మంది పిల్లలకు సమయానికి అందిస్తున్నారు. ఈ రోజు మంచి పోషకాహారం పొందే పిల్లలే రేపటి భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారు. తెలంగాణ పిల్లలకు సేవ చేసే ఈ గొప్ప అవకాశం ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కి, ఉప ముఖ్యమంత్రి కి, మంత్రివర్గంలోని ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు.

- సత్యగౌరచంద్ర, రీజినల్ ప్రెసిడెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్



(మహా - కొడంగల్ )

పస్తుల పేగుల స్థానంలో అక్షరాల ఆకలి రాజుకుంటోంది. ఖాళీ కడుపులతో బడిగడప తొక్కే దైన్యం కనుమరుగై, ఉదయం కాగానే అల్పాహారం అమృతంలా ఎదురుచూస్తున్న వేళ తెలంగాణ విద్యావ్యవస్థలో ఓ మహా విప్లవం ఆవిష్కృతమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతతో, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో రూపుదిద్దుకున్న ఈ బృహత్తర పథకం కొడంగల్ వేదికగా అద్భుత ఫలితాలను సాధిస్తోంది. సర్కారు బడుల రూపురేఖలను సమూలంగా మార్చేస్తూ, విద్యార్థుల ఆకలి బాధలను శాశ్వతంగా దూరం చేయడంతో పాటు, వారిని తరగతి గదుల వైపు అయస్కాంతంలా ఆకర్షిస్తూ విద్యా ప్రగతిలో నవశకానికి నాంది పలుకుతోంది.





## బడుల వైపు పరుగులు తీస్తున్న బాల్యం!

ఈ పథకం సృష్టించిన సంచలనం సాధారణమైనది కాదు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే విద్యార్థుల నమోదు ఏకంగా 13 శాతం పెరగడం ఈ పథకం విజయ దుందుభికి సజీవ సాక్ష్యం. కేవలం 60 పాఠశాలల్లోనే ఏకంగా 1,525 మంది విద్యాvర్థులు అదనంగా చేరడం సర్కారు బడుల కీర్తిని నలుదిశలా చాటుతోంది. వీరిలో 882 మంది బాలురు కాగా, 643 మంది బాలికలు ఉండటం విశేషం. బడి మానేసే దశ నుంచి తిరిగి పుస్తకాలు పట్టే దిశగా విద్యార్థులు వేస్తున్న అడుగులు విద్యావిధానంలో ఒక గొప్ప మార్పును సూచిస్తున్నాయి.















- అల్పాహార పథకం అమల్లోకి వచ్చిన నాటినుంచి బడుల్లో విద్యార్థుల కిలకిలరావాలు అనూహ్యంగా పెరిగాయి, హాజరు ఏకంగా 20 నుంచి 22 శాతం వరకు రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా బడికి వచ్చే విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగిందని 92.8 శాతం మంది తల్లిదండ్రులు, 89.2 శాతం మంది ఉపాధ్యాయులు ధృవీకరించడం ఈ పథకం సాధించిన అపూర్వ విజయం. సమయానికి పాఠశాలకు చేరుకునే వారి సంఖ్య 92.6 శాతానికి చేరడం వారిలోని క్రమశిక్షణకు, బడిపై పెరిగిన మమకారానికి అద్దం పడుతోంది.
- తరగతి గదిలో ఆకలి నీరసం ఛాయలు ఇక ఎంతమాత్రం కనిపించడం లేదని ఉపాధ్యాయ లోకం గర్వంగా చెబుతోంది. నూటికి 98.3 శాతం మంది ఉపాధ్యాయులు ముక్తకంఠంతో పిల్లల్లో ఆకలి ఫిర్యాదులు కనుమరుగయ్యాయని స్పష్టం చేయడం ఈ పథకం సృష్టించిన సామాజిక మార్పునకు నిదర్శనం. కడుపు నిండాక పిల్లల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోందని 88.1 శాతం మంది ఉపాధ్యాయులు, విద్యా సామర్థ్యం అద్భుతంగా మెరుగుపడిందని 81.2 శాతం మంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం వికసిస్తున్న తీరు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.
- ఈ పథకానికి అసలైన న్యాయనిర్ణేతలైన విద్యార్థులు సైతం బ్రహ్మరథం పడుతున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో 99.9 శాతం మంది విద్యార్థులు ఎంతో ఇష్టంగా పాఠశాలలో అల్పాహారాన్ని ఆరగిస్తుండటం గమనార్హం. రుచి, నాణ్యత, పరిశుభ్రత, ఆహారాన్ని వేడిగా అందించే విధానంపై విద్యార్థులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా మెనూలో అందించే బోండాచట్నీని 98.1 శాతం, దోశచట్నీని 95.3 శాతం, చిరుధాన్యాల ఇడ్లీసాంబార్‌ను 93.6 శాతం మంది అమితంగా ఇష్టపడుతున్నారు. అంతేకాకుండా, వడ కూడా కావాలని 29.2 శాతం మంది ముద్దుగా అడగటం వారి ఆహారపు ఆనందాన్ని ప్రతిబింబిస్తోంది.
- తమ పిల్లలు రోజూ ఉత్సాహంగా బడికి వెళ్తుండటం చూసి మురిసిపోతున్న 96.2 శాతం మంది తల్లిదండ్రులు, ఏకంగా ఈ ప్రభుత్వ పాఠశాలలను ఇతరులకు కూడా గర్వంగా సిఫారసు చేస్తామనడం ఈ బృహత్తర కార్యక్రమంపై వారికి ఉన్న అచంచలమైన నమ్మకానికి ప్రతీక. అల్పాహారం నాణ్యత చాలా బాగుందని 95.7 శాతం మంది తల్లిదండ్రులు కితాబునిస్తున్నారు. పిల్లలు ఇంటికొచ్చాక అల్పాహారం గురించి ఆనందంగా చర్చిస్తున్నారని 97.6 శాతం మంది వివరించడం ఈ పథకం తీసుకువచ్చిన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని స్పష్టం చేస్తోంది.
- అద్భుతమైన ఈ పథకాన్ని మరింత పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో కొన్ని నిర్మాణాత్మక సూచనలు కూడా తెరపైకి వచ్చాయి. ముఖ్యంగా ఆహారంలో నూనె వాడకాన్ని నియంత్రించాలని, తయారీలో నాణ్యతను స్థిరంగా కొనసాగించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థుల ఎత్తు, బరువు లను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఈ మహా యజ్ఞాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని, మరింత విస్తరించాలని నూటికి నూరు శాతం మంది ఉపాధ్యాయులు పూర్తిస్థాయి మద్దతు ప్రకటిస్తున్నారు. సర్కారు బడుల కీర్తి ప్రతిష్టలను నలుదిశలా వ్యాపింపజేయడంలో ఈ పథకం ఒక సువర్ణాధ్యాయంగా చరిత్రలో నిలిచిపోవడం తథ్యం.



# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

**మందమర్రి, మహా** : మందమర్రి తెలంగాణ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని మిట్టపల్లి హర్షిత ఘనత సాధించింది. అండర్ 19 విభాగంలో ఫుట్ బాల్ క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ తెలిపారు. ఈ నెల 16, 17, 18 తేదీలలో ఖమ్మంలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఆమె మంచిర్యాల జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తుందని వెల్లడించారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హర్షితను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం. చిన్నక్క లు హర్షితను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హర్షిత సాధించిన విజయంపై కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.




# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలి

**మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ**

**మందమర్రి, మహా :** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ వ్యాప్తంగా అక్టోబర్ 2 నుండి 31 వరకు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ 6.0 స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఈవేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల) సేకరణ, శాస్త్రీయ పద్ధతిలో విసర్జనకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కాలం చెల్లిన కంప్యూటర్లు, కీ బోర్డులు, మౌస్ లు, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను చెత్తలో కలపకుండా వేరు చేసి సేకరించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. ప్రతి ఉద్యోగి తమ ఇళ్లలో, కార్యాలయాల్లో ఉన్న ఈవేస్ట్ ను ఈ కలెక్షన్ బిన్ లో వేసి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని తమ వద్ద ఉన్న పాత ఎలక్ట్రానిక్ వస్తువులను కలెక్షన్ బాక్స్ లో వేశారు. సేకరించిన ఈవేస్ట్ ను అధీకృత రీసైక్లింగ్ ఏజెన్సీ ద్వారా శాస్త్రీయంగా డిస్పోజల్ చేస్తామని సీఎం వెల్లడించారు.




# యూనిఫాం తో విద్యార్థుల్లో బేధభావాలు దూరం

- డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్
- జిల్లా వ్యాప్తంగా 2704 విద్యార్థులకు పంపిణీ

**వరంగల్, మహా** : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏకరూప దుస్తులతో విద్యార్థుల్లో నూతనోత్సాహం తో పాటు ఐక్యతా భావం పెరుగుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11 జూనియర్ కళాశాలల్లో 2704 మంది విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి ఏకరూప దుస్తుల పంపిణీ అవుతున్నదని, పండుగ ముందు యూనిఫాం పంపిణీ అంటే కొత్త బట్టలతో పండుగ ప్రారంభం కావడం శుభసూచకమని అన్నారు. యూనిఫాం వల్ల విద్యార్థుల్లో ఉండే బేధభావాలు దూరం అవుతాయని, అందరూ ఒక్కరీతిన కనిపించడం విద్యార్థుల ఐక్యతకు దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ఇంటర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ గతంలో నోట్ బుక్స్, షూ, బ్యాగులు ఇచ్చారని, ఇపుడు యూనిఫాం ఇవ్వడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారం తగ్గనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకుల తోపాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి అంతిమ యాత్రకు సామగ్రి అందజేత

**వృద్ధురాలి అంతిమ యాత్రకు సామగ్రి అందజేత**

**పెద్దపల్లి మహా :** రామగుండం: మానవత్వంతో ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మరోసారి తన సేవా గుణం చాటుకుంది. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ కాకతీయ నగర్‌కు చెందిన చల్ల కొండమ్మ అనే వృద్ధురాలు గురువారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్, ఫౌండేషన్ సభ్యులతో కలిసి తక్షణమే స్పందించారు. మృతురాలి అంతిమ సంస్కారాల నిర్వహణకు అవసరమైన పాడే సామగ్రిని సమకూర్చి, ఆమె నివాసానికి పంపించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించి, కష్ట సమయంలో వారికి అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి తోడ్పాటునందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఆపద సమయంలో స్పందించి, అంతిమ యాత్రకు అవసరమైన సామగ్రిని అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ మాట్లాడుతూ, పేదలకు, ఆపదలో ఉన్న వారికి సహాయం అందించడంలో తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. సమాజంలో మానవత్వం, సేవాభావం పెంపొందించాలనే ఉద్దేశంతో తమ వంతు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. మృతురాలు చల్ల కొండమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# సంప్రదాయాల సౌరభం..సద్దుల బతుకమ్మ

- పండుగలకు బల్దియా ఘనమైన ఏర్పాట్లు
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న



**కార్పొరేషన్,మహా** : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాలతోజరుపుకునేలా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తెలిపారు. శుక్రవారం కమిషనర్ హన్మకొండ నగర పరిధిలోని హసన్‌పర్తి చెరువు, భీమారం చెరువు తదితర ప్రాంతాలను సందర్శించి బతుకమ్మ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ, పండుగకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని,బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించా. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ దీపాలు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయిన వెంటనే పారిశుద్ధ్య సిబ్బంది చెరువుల పరిసరాలను శుభ్రం చేయాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం అని ఆడపడుచుల ఆనందమే పండుగకు అసలైన శోభ. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండుగను జరుపుకునేలా, నగరంలో పండుగ వాతావరణం వెల్లివిరిసేలా జీడబ్ల్యూఎంసీ అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల ఓటింగ్ ను పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు ఇనగాల

- ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్న కార్మికులు
- వరంగల్, హనుమకొండ ఆర్టీసీ డిపో-1 లలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల పర్యటన



**హనుమకొండ, మహా** : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో సుదీర్ఘ దశాబ్ద కాలం విరామం తర్వాత ప్రతిష్ఠాత్మకమైన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం వరంగల్, హనుమకొండ ఆర్టీసీ డిపోలలో విస్తృతంగా పర్యటించారు. డిపోల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని, కార్మికుల ఉత్సాహాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. డిపో పరిసరాల్లో విధులకు హాజరైన మరియు ఓటు వేసేందుకు వచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందితో ఆయన ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రజాస్వామ్యబద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్యం వల్ల దశాబ్ద కాలంగా ఎన్నికలు లేక ఆర్టీసీ కార్మికులు తమ హక్కులను కోల్పోయి, గళం విప్పలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. నేడు అధికారంలో ఉన్న ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక హక్కులకు పెద్దపీట వేస్తూ, పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికలను నిర్వహిస్తోంది. 'మహాలక్ష్మి' ఉచిత బస్సు పథకం ద్వారా ఆర్టీసీ సంస్థను ప్రజలకు మరింత చేరువ చేయడమే కాకుండా, కార్మికుల సంక్షేమానికి మా ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ సారి జరుగుతున్న పోలింగ్‌లో కార్మికులు ఎలాంటి భయాందోళనలు లేకుండా, ఆర్టీసీ సంస్థ ప్రయోజనాలను, తమ సంక్షేమాన్ని కాపాడే సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరిస్తున్న ఎన్నికల సిబ్బందికి, భద్రతా సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో ఐఎన్‌టీయూసీ కార్మిక విభాగ ప్రతినిధులు కూర వెంకట్, బ్లాక్ అధ్యక్షులు బంక సంపత్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ధర్మారంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పెద్దపల్లి మహా :** ధర్మారం: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ధర్మారం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల తిరుపతి యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోగాల తిరుపతి, ఉపసర్పంచ్ ఎలిగేటి మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈదుల శ్రీనివాస్ యాదవ్, పెరుమాండ్ల ప్రసాద్, అనవేణి హరీష్, గైక్వాడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

**పెద్దపల్లి మహా** : కాల్వశ్రీరాంపూర్ :భూముల రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రైతులు, గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని తహసీల్దార్ రాపెల్లి రాముడు కోరారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో శుక్రవారం సర్పంచ్ జ్యోత్స్న ఆధ్వర్యంలో భూముల రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాపెల్లి రాముడు మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రాముఖ్యతను వివరించారు. భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించి, సర్వే ప్రక్రియలో ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యమని తెలిపారు. రీ సర్వేకు సంబంధించి రైతులు, గ్రామస్థులకు ఉన్న సందేహాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. రెవెన్యూ అధికారులు చేపట్టనున్న రీ సర్వే ప్రక్రియలో గ్రామస్థులు చురుకుగా పాల్గొనాలని, అవసరమైన వివరాలను అధికారులకు అందించి సర్వే సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన ఉండటం అవసరమని ఈ సందర్భంగా వివరించారు. గ్రామసభ ద్వారా భూముల రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రావణి, రెవెన్యూ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలలో సహకారం అందించాలి...

**ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి..**

**రాజేంద్రనగర్ మహా ;** మహబూబ్‌నగర్‌రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సామ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో కలిసి రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి సంపూర్ణ మద్దతు తెలపాలని ఆయన ఎమ్మెల్యే కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పట్టభద్రులైన ఓటర్లందరూ తనకు ఓటు వేసి గెలిపించేలా తనకు సహకారం అందించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి అభ్యర్థించారు.



# మందమర్రి మోడల్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**మందమర్రి, మహా**: మంచిర్యాల జిల్లా మందమర్రిలోని పీఎం తెలంగాణ మోడల్ స్కూల్ లోని విద్యార్థినీలతో ఉపాధ్యాయులు గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తుల్లో, రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో సందడి చేశారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో ఆడిపాడారు. పూల పండుగ విశిష్టతను, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటిచెప్పేలా వేడుకలు సాగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ మాట్లాడుతూ ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతా భావం ఏర్పడుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతిని తెలుసుకొని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.




# ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పోస్టులు

**ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల**

**హనుమకొండ, మహా** : హనుమకొండ జిల్లా పరిధిలోని ఆరోగ్య శాఖలో పని చేయడానికి వివిధ కేటగిరీల పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ఆహ్వానిస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికెట్ల ప్రతులను ఈ నెల 15వ తేదీలోగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 91774 55806 నెంబర్ లో సంప్రదించాలని డీఎంహెచ్ఓ సూచించారు.

# కరెంటు కోతలతో రైతుల అవస్థలు

**వర్షా భావానికి తోడు విద్యుత్ కోతలు.. పంటలపై తీవ్ర ప్రభావం**

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో ఇప్పటికే పంటలు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. దీనికి తోడు విద్యుత్ కోతలు రైతులకు మరింత ఇబ్బందులు కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా అందకపోవడంతో వ్యవసాయ బోర్లపై ఆధారపడుతున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో పంటలకు సకాలంలో నీరందించలేకపోతున్నామని రైతులు చెబుతున్నారు. వర్షాలు తక్కువగా ఉండటంతో భూగర్భ జలాలపై ఆధారపడి పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. అయితే విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా మోటార్లు పనిచేయక పంట పొలాలకు నీరు అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో పంటలు ఎండిపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, కరెంటు కోతలను తగ్గించి పంటలను కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "వర్షాలు లేక పంటలకు నీటి అవసరం పెరిగింది. కరెంటు సక్రమంగా రాకపోవడంతో బోర్లు నడపలేకపోతున్నాం. పంటలు ఎండిపోతే పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి ఉండదు" అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# శ్రీ రాగా స్కూల్లో సంబరాల జోష్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం పట్టణంలోని మేదరబస్తీలో ఉన్న శ్రీ రాగా ప్లే అండ్ హై స్కూల్‌లో శుక్రవారం దసరా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అండ్ ఫౌండర్ మల్లారపు వరప్రసాద్, డైరెక్టర్ మల్లారపు కవిత అమ్మవారికి పసుపు కుంకుమ పూలతో పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల బతుకమ్మలతో సందడి చేయగా విద్యార్థులు ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలు విలువలను నేర్పించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. కవిత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం సృజనాత్మకత ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనగా పాఠశాల యాజమాన్యం అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేసింది.



## వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు..
# రైతులు అప్రమత్తంగా ఉండాలి

- రైతు ఐడీ నమోదులో 87.27 శాతంతో పాలకుర్తికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం

**పాలకుర్తి, మహా :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని వరి పొలాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు లక్షణాలు కనిపిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ సూచించారు.శుక్రవారం మండలంలోని ఈసాల తక్కళ్లపల్లి గ్రామంలో వరి పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుత వరి సాగులో చీడపీడల పరిస్థితిని పరిశీలిస్తూ, బ్యాక్టీరియా ఎండాకు తెగులు లక్షణాలను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటలో పిలకలు తొడిగే దశలో, చిరు పొట్ట దశలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, ఆకుల అంచుల నుంచి ఎండిపోతాయని వ్యవసాయ అధికారి తెలిపారు. ఆకులపై పసుపు పచ్చని జిగురు వంటి పదార్థం ఏర్పడి, ఎండ వేడిమికి గట్టిపడి చిన్న ఉండలుగా మారుతుందని వివరించారు.తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే యూరియా, అమ్మోనియా వంటి నత్రజని ఎరువుల వాడకాన్ని నిలిపివేయాలని, పొటాష్ కలిగిన ఎరువులను సిఫార్సు మేరకు వినియోగించాలని సూచించారు. తెగులు సోకిన మడి నుంచి ఇతర మడులకు నీరు పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**రైతు ఐడీ నమోదులో పాలకుర్తికి ప్రథమ స్థానం**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాలకుర్తి మండలం 87.27 శాతం నమోదు పూర్తి చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన రైతు ఐడీ జారీ చేసే ఈ కార్యక్రమంలో రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో వ్యవసాయ సేవలు, పంట రుణాలు, పంట కొనుగోలు, సబ్సిడీలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఈ నమోదు ఉపయోగపడుతుందని వివరించారు. రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి AEO లేదా మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి రైతు ఐడీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో జయ్యారం వ్యవసాయ విస్తరణ అధికారి కె. శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ అభినందనలు

**కరీంనగర్ మహా** : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. ఎన్నికల ద్వారా నూతన కార్యవర్గం ఎంపికైన నేపథ్యంలో సభ్యులు శుక్రవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవతా విలువలను చాటాలని సూచించారు. సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు.

**నూతన కార్యవర్గం:** వైస్ చైర్మన్‌గా ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా పెండ్యాల కేశవరెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్‌గా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్, యూత్ కోఆర్డినేటర్‌గా మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కోలా అన్నారెడ్డి, పెద్ది విద్యాసాగర్, చిదుర సురేష్, పి. శ్రీహరి రెడ్డి, రాగి శ్రీనివాస్, సాయిని నరేందర్, హనుమాండ్ల రాజిరెడ్డి, కానపర్తి మనోహర్ రావు, ఎలుగందల మునీందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మింధర్ సింగ్, టీఎన్జీవోల సంఘం కరీంనగర్ టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలి!

**ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన.**
**సంఘీభావం తెలిపిన సీపీఐ నాయకులు**

**పెద్దపల్లి, మహా :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లిలో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ నిరసనకు పెద్దపల్లి జిల్లా సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక నాయకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, పౌరులకు ఓటు హక్కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారని, దీనివల్ల అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 నుంచి ఇప్పటివరకు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించలేదని, సుమారు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు వారు ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరిపి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటర్లు తమ నాయకులను ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థలో, ఓటర్లనే ఎంపిక చేసే పరిస్థితి ఏర్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.గతంలో ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భాగస్వాములుగా ఉండేవారని నాయకులు గుర్తుచేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం ద్వారా సుప్రీం




కోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీ నుంచి తొలగించిందని పేర్కొన్నారు. ఈ మార్పు ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.ఎన్నికల కమిషనర్ల నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భాగస్వామ్యంతో కూడిన నిష్పక్షపాత ఎంపిక విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను బర్తరఫ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జామా మసీదు మౌలానా మహమ్మద్ అజీముద్దీన్ అహ్మద్, ముస్లిం నాయకులు సయ్యద్ మస్రత్, అబ్దుల్ హై జావిద్, ఎంఏ మొహీద్, కౌన్సిలర్లు మీర్జా షంషేర్ బేగ్, అస్లాం పర్వేజ్, సల్మాన్, అష్రాఫ్, యూనిస్ ఖాన్, నదీమ్, రఫీ ఉల్లా ఖాన్, మెహరాజ్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బాలసాని లెనిన్, సీపీఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, కుక్క శ్రావణ్ కుమార్‌తో పాటు పలువురు ముస్లిం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం

- చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
- వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో మోకాళ్ల ఆపరేషన్లకు సీ-ఆర్మ్ మిషన్
- వినికిడి పరీక్షలు, థెరపీ సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడ ఏరియా ఆసుపత్రిలో 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమం
- వినియోగంలోకి బేరా యంత్రం
- సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు




**వేములవాడ,మహా**: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు చిన్నారుల్లో పోషకాహార లోపం, పుట్టుకతో వచ్చే ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆవరణలో 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించారు. ఆసుపత్రిలో బేరా యంత్రాన్ని ప్రారంభించారు. డీ ఈ ఐ సీ కేంద్రంలో దాదాపు 18 మంది పిల్లలు ఫిజియోథెరపీ ద్వారా శారీరక ఇబ్బందులు దూరమై ఇప్పుడు నడుస్తున్నారని పలువురు తల్లితండ్రులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పోషణ మాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, బెల్లం, నువ్వులు బాలామృతంతో సిద్ధం చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడంతో పాటు ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను తల్లుల మాదిరిగా అంగన్‌వాడీ టీచర్లు సంరక్షిస్తున్నారని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా స్వయం సహాయక సంఘాల స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు సమకూరుస్తున్నారని వెల్లడించారు.

**సమస్యలపై ప్రత్యేక దృష్టి**

చిన్నారుల్లో వినికిడి లోపం, మాటలు రాకపోవడం, శారీరక ఎదుగుదలలో సమస్యలు వంటి లోపాలను చిన్న వయసులోనే గుర్తించి చికిత్స అందించడం ఎంతో ముఖ్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో గుర్తించిన కొంతమంది చిన్నారులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్, సరోజినీదేవి, ఈఎన్‌టీ వంటి ఆసుపత్రులకు పంపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పేదరికం కారణంగా వైద్యం పొందలేని పరిస్థితి చిన్నారులకు ఎదురుకాకూడదని, అవసరమైన వైద్య పరీక్షలు, ఫిజియోథెరపీ, ఇతర చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందులో భాగంగా వేములవాడ ఆసుపత్రిలోనే ప్రత్యేక థెరపీ సేవలు అందించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వినికిడి లోపాన్ని గుర్తించేందుకు ప్రత్యేక పరీక్షల నిర్వహణకు అవసరమైన గదిని ఏర్పాటు చేసి సేవలను ప్రారంభించినట్లు వివరించారు.

**మోకాళ్ల ఆపరేషన్లకు సీ-ఆర్మ్ మిషన్**

వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా మోకాళ్లకు సంబంధించిన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఆపరేషన్ల నిర్వహణలో సీఆర్మ్ మిషన్ అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, తాజాగా మిషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అర్హులైన పేదలకు ఉచితంగా మోకాళ్ల శస్త్రచికిత్సలు అందిస్తున్నామని, వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఈ సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్**

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు విద్యుత్ బిల్లుల భారం లేకుండా ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. చిన్నారుల్లో ఏవైనా ఆరోగ్య సమస్యలు కనిపించిన వెంటనే తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది సంబంధిత వైద్యులకు తెలియజేయాలని కోరారు. అవసరమైన వైద్య సహాయం అందిస్తామని పేర్కొన్నారు.

# దుర్గమ్మ ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**పెద్దపల్లి మహా** : గోదావరిఖని: గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి, స్టేషన్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం, రానున్న దుర్గమ్మ ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని 2 టౌన్ సీఐలు ప్రసాద్ రావు, లింగమూర్తి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి కమిషనర్ గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రిసెప్షన్ కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. స్టేషన్ రికార్డులను క్రమ పద్ధతిలో నిర్వహించడంతోపాటు కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సంబంధిత రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, పోలీసు నిఘా, రాత్రి గస్తీ తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**దుర్గమ్మ ఉత్సవాలపై ప్రత్యేక నిఘా**

త్వరలో నిర్వహించనున్న దుర్గమ్మ ఉత్సవాలు, ఊరేగింపుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఊరేగింపుల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం డీజేలకు అనుమతి లేదనే విషయాన్ని ఉత్సవ నిర్వాహకులకు ముందుగానే స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గనులు, పారిశ్రామిక సంస్థల భద్రతకు ప్రాధాన్యం**

పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓపెన్‌కాస్ట్ గనులు, సింగరేణి బొగ్గు గనులు, పారిశ్రామిక సంస్థల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ఆయా ప్రాంతాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తూ సంబంధిత భద్రతా సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.నేరాల నియంత్రణకు రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు.

# సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల



**మంచిర్యాల, మహా ప్రతినిధి** : ప్రజలకు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందించడంతో పాటు, ప్రభుత్వ శాఖలలో జవాబుదారీతనాన్ని పెంపొందించేలా సమాచార హక్కు చట్టం2005ను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పిలుపునిచ్చారు.సమాచార హక్కు చట్టం వారోత్సవాలు 2026ను పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, పీసీసీఎఫ్ వినయ్ కుమార్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బెనహర్ మహేష్ దత్, రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల సమీకృత కలెక్టరేట్ల నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికారుల పనితీరులో జవాబుదారీతనం పెరుగుతాయని తెలిపారు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, పౌర సమాజంపై ఉందన్నారు. చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ నిర్ణీత గడువులోగా దరఖాస్తులకు సమాధానాలు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులందరూ సమాచార హక్కు చట్టం2005ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలు చేస్తూ, ప్రజలకు చట్టబద్ధంగా అందించాల్సిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ అందిస్తున్న సేవలు, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించిన అంశాలను వివరించే సమాచార దర్పణం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి. రాములు, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు

**18 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం**
**ముగ్గురిపై కేసు నమోదు**

**పెద్దపల్లి మహా , ధర్మారం:** పెద్దపల్లి జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ దందా కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మేడారం గ్రామంలోని శ్రీలక్ష్మి నరసింహ రైస్ మిల్లులో శుక్రవారం పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రాజిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ కలిసి రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మిల్లులో నిల్వ ఉంచిన 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తి, రైస్ మిల్లు యజమానిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

# రైల్వే స్టేషన్ లో సమస్యలు పరిష్కరించాలి

- రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి
- ఏవో కులకర్ణి సుభాష్ కు వినతిపత్రం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వివిధ సమస్యలపై శుక్రవారం శ్రీనివాస్ రెడ్డి సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ కొత్తగూడెం ఏరియాకు ఏరియా ఆఫీసర్ గా ఉన్న కులకర్ణి సుభాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు తక్షణం పూర్తి చేయాలని కోరారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు గత నాలుగు సంవత్సరాలుగా నత్త నడక నడుస్తున్నాయని తక్షణమే పనులు పూర్తి చేసి రానున్న గోదావరి పుష్కరాల నాటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులకు ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కరోనాలో రద్దు అయిన కొత్తగూడెం టు కాజీపేట ట్రైన్, కొత్తగూడెం టు డోర్నకల్ ట్రైన్, కొల్హాపూర్ బెల్గావి ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరణ చేయాలని విన్నవించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత భక్తులు ప్రజల చిరకాల కోరిక అయినా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రామాలయంనుండి కలియుగ దైవమైన తిరుపతికి టెంపుల్ టు టెంపుల్ కు ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేసి స్పెషల్ ట్రైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగూడెం నడిబొడ్డులో ఉన్న రాజీవ్ పార్క్, ఎన్జీవోస్ కాలనీ, ప్రగతి మైదాన్ వెళ్లే దారి గత 100 సంవత్సరాలు పైగా తాత ముత్తాతల కాలం నుండి ఉందని దానిని మూసి వేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ దారిని రీఓపెన్ చేపించాలని విజ్ఞప్తి చేశారు. పాండురంగాపురం టు సారపాక వరకు మంజూరైన రైల్వే లైన్ పనులను సెంట్రల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరగా ప్రారంభించి పూర్తి చేపించేలా కృషి చేయాలని అదేవిధంగా బొగ్గుట్టగా పేరుగాంచిన ఇల్లందుకు తిరిగి రైలు సౌకర్యం కల్పించాలని ఏవోకు విన్నవించారు. ఏవో కులకర్ణి సుభాష్ మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంత ప్రజల రైల్వే సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.





## వాటర్ సప్లై కార్మికులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలి

- పెండింగ్ వేతనాలను దసరాలోపు చెల్లించాలని
- టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్

**మణుగూరు, మహా** : మణుగూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న వాటర్ సప్లై కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఇతర చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో గత ఎనిమిదేళ్లుగా 14 మంది వాటర్ సప్లై కార్మికులు పనిచేస్తున్నప్పటికీ నేటికీ పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. దసరా పండుగలోపే పెండింగ్ వేతనాలన్నీ చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో కార్మికుల కుటుంబాలు పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు బత్తుల వెంకటేశ్వర్లు, మణుగూరు బ్రాంచ్ అధ్యక్షుడు బత్తుల వెంకటరమణ, కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, సహాయ కార్యదర్శి షఫీ ఉద్దీన్, నాయకులు కుమార్, వేముల శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సౌజన్యంతో కిష్టారానికి రూ.1.89 కోట్ల అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే రాగమయికి ఘనస్వాగతం.. బైక్ ర్యాలీతో కదిలివచ్చిన గ్రామస్థులు
- యువత, మహిళల నీరాజనాల మధ్య అభివృద్ధి పనుల ప్రారంభం.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**సత్తుపల్లి, అక్టోబరు 9**: మహా : సింగరేణి సంస్థ సౌజన్యంతో కిష్టారం గ్రామంలో రూ.1.89 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్ లకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహించి సాదరంగా ఆహ్వానించారు.. యువత, మహిళలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గ్రామ సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి అప్పారావు, సింగరేణి జీఎం వెంకటాచారితో కలిసి పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**విద్యా వసతులకు రూ.81.70 లక్షలు**

కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభా ప్రాంగణం నిర్మాణానికి రూ.21.50 లక్షలు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.20.80 లక్షలు కేటాయించారు. ఈ పనులు పూర్తయ్యాయి. పాఠశాలలో ముళ్లకంచె ఏర్పాటు, భోజనశాల ఆధునికీకరణకు రూ.39.40 లక్షలు కేటాయించగా పనులు కొనసాగుతున్నాయి.రహదారులు, ఇతర నిర్మాణాలకు రూ.89.27 లక్షలు గ్రామంలో సీసీ రహదారి నిర్మాణానికి రూ.46 లక్షలు, గోదాము (మినీ ఫంక్షన్ హాలు) నిర్మాణానికి రూ.38.27 లక్షలు, రామాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షలు వెచ్చించారు. ఈ పనులు పూర్తయ్యాయి.

**తాగునీటి సదుపాయాలకు రూ.18 లక్షలు**

గ్రామంలోని అంబేద్కర్‌నగర్‌లో శుద్ధజల కేంద్రం ఏర్పాటుకు రూ.9 లక్షలు, ఎస్సీ కాలనీలో మరో శుద్ధజల కేంద్రం నిర్మాణానికి రూ.9 లక్షలు కేటాయించారు. ఈ రెండు పనులు పూర్తయ్యాయి. సింగరేణి సంస్థ సౌజన్యంతో చేపట్టిన ఈ పనులు గ్రామంలో విద్యా వసతులు, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల మెరుగుదలకు దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ నాయకులు ఉడతనే అప్పారావు, జేష్ట అప్పారావు, నరుకుళ్ల అప్పారావు, నరుకుళ్ల రవి, ఉప సర్పంచ్ శీలం నాగరాణి, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి**

**హనుమకొండ, మహా;** హనుమకొండ జిల్లా ,వడ్డెపల్లి లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎల్. నరేందర్ నాయక్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. వి. గిరిరాజ్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అసభ్య పదజాలం ఉపయోగించారని, ఇతర దుష్ప్రవర్తన కు పాల్పడ్డారని ఆయన పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన పై తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందాయి. పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది జోక్యం చేసుకోగా తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ సహా విద్యార్థి సంఘాలు వినతిపత్రాలు సమర్పించాయి. పై వివరాలను జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్, హనుమకొండ పరిశీలించి, సస్పెన్షన్ కు ఆమోదం తెలిపారు. దీంతో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991 ప్రకారం ఎల్. నరేందర్ నాయక్ ను తక్షణమే సస్పెండ్ చేశారు. క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుంది. విద్యార్థుల భద్రత, గౌరవం, సంక్షేమమే విద్యాశాఖకు అత్యంత ప్రాధాన్యమని, ఇలాంటి ఘటనల పై తక్షణమే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



## చిన్నారుల మానసిక ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత..

- ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రేమ, ప్రోత్సాహం అందించాలి..
- మణుగూరు న్యాయమూర్తి కంబపు సూరిరెడ్డి

**మణుగూరు, మహా** : చిన్నారుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మణుగూరు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కంబపు సూరిరెడ్డి సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు సంతోష్‌నగర్‌లోని శ్రీ సత్యసాయి ప్రత్యేక అవసరాల చిన్నారుల పాఠశాల, ఎంపీడీవో కార్యాలయ సముదాయంలోని భవిత పాఠశాలలలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సూరిరెడ్డి మాట్లాడుతూ ప్రతి చిన్నారిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, వారిని ఇతరులతో పోల్చకుండా ప్రేమతో ప్రోత్సహించాలని సూచించారు. చిన్నారులు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ఆత్మీయ వాతావరణం కల్పించాలని, వారి మనోభావాలను గౌరవిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని అన్నారు. ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించడం సమాజ బాధ్యతని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ చిన్నారులకు పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు కృష్ణ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాది అంకం సర్వేశ్వరరావు, మండల న్యాయసేవాధికార సంస్థ కోఆర్డినేటర్ ఏ రవీందర్ పాల్గొనగా.. శ్రీ సత్యసాయి పాఠశాల కరస్పాండెంట్ నాగమణి, భవిత పాఠశాల శిక్షణ ఉపాధ్యాయులు నాగశ్రీ, శ్యాంనాయక్, ప్రణీత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరులో ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు..

- 240 ఓట్లకు 132 ఓట్లు పోలింగ్..
- 55 శాతం పోలింగ్ నమోదు..
- పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు..

**మణుగూరు, మహా** : మణుగూరు ఆర్టీసీ డిపోలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ శుక్రవారం పోలీసు బందోబస్తు మధ్య కొనసాగింది. డిపో పరిధిలో మొత్తం 240 ఓట్లు ఉండగా 132 మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 55 శాతం పోలింగ్ నమోదైంది. కార్మికులు పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డిపో వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మణుగూరు డీఎస్పీ రవీంద్రారెడ్డి, సీఐ నాగబాబు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఎన్నికల ప్రక్రియను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓటు వేసేందుకు కేంద్రంలోకి వెళ్తున్న కార్మికుల గుర్తింపు కార్డులను సీఐ నాగబాబు పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పోలీసు సిబ్బందికి డీఎస్పీ పలు సూచనలు చేశారు. డిపో పరిసరాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తులో డీఎస్పీ రవీంద్రారెడ్డి, సీఐ నాగబాబుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## స్వచ్ఛతపై విద్యార్థుల సృజనాత్మక చిత్రాలు

- సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా చిత్రలేఖన పోటీలు
- విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

**సత్తుపల్లి, అక్టోబర్ 9**:మహా : స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు సత్తుపల్లి పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో స్వచ్ఛ భారత్ అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, కె.శైలజ పర్యవేక్షణలో పట్టణ భాజపా అధ్యక్షుడు బానోత్ విజయకుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర భాజపా అధికార ప్రతినిధి, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నంబూరి రామలింగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్వచ్ఛ భారత్, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు.

**చిత్రాల్లో ప్రతిభ.. బహుమతులు**

చిత్రలేఖన పోటీల్లో డి.వికిల్ సాక్షిత్ ప్రథమ, కె.ప్రదీప్ ద్వితీయ, కె.రీనా హర్షిని తృతీయ బహుమతులు సాధించారు. స్వచ్ఛత ప్రాధాన్యాన్ని చిత్రాల ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతతో చాటారు.

**ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం**

ఈ సందర్భంగా నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన నరేంద్ర మోదీ ప్రజా ప్రస్థానం ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహించే స్థాయికి చేరిందన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేదల సంక్షేమం, స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పట్టణ భాజపా ప్రధాన కార్యదర్శి మంద శివ, నాగ మౌనిక, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సత్య భాస్కర పాఠశాలలో బతుకమ్మ సందడి..

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు..
- కోలాటాలు.. ఆకట్టుకున్న పూల బతుకమ్మలు..

**మణుగూరు, మహా** : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చాపల మార్కెట్ ప్రాంతంలో గల శ్రీ సత్య భాస్కర మాంటిస్సోరి హైస్కూల్లో శుక్రవారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల ఆటపాటలతో పాఠశాల ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ థామస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, మహిళల ఐక్యతకు, ప్రకృతితో మానవాళికి ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. పూలను అందంగా పేర్చి బతుకమ్మలను అలంకరించిన విద్యార్థినులను అభినందించారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, విద్యార్థినుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



## భద్రాద్రి కలెక్టర్ కు అవార్డు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమాచార హక్కు వారోత్సవాలు-2026 కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ అవార్డును స్వీకరించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత జవాబుదారీతనాన్ని పెంపొందించడం పౌరులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడం చట్ట నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలను గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులకు ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పొందే హక్కు కల్పించబడింది. ప్రభుత్వ శాఖలు పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూడటంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. చట్ట నిబంధనల ప్రకారం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచడం ద్వారా ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించవచ్చు. జిల్లా కలెక్టర్ అంకిత్ నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పారదర్శకతను పాటించేందుకు కృషి చేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడం వివిధ శాఖల పనితీరులో జవాబుదారీతనాన్ని పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాకు లభించిన ఈ అవార్డు ప్రజాకేంద్రిత పాలన పారదర్శకత జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించడం ప్రభుత్వ శాఖలు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించేలా చూడటం ముఖ్యమని ఆయన తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పారదర్శకమైన పరిపాలనను కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.



## పి.యం.శ్రీ పాఠశాల లో బతుకమ్మ సంబరాలు.

**దమ్మపేట ,మహా** : తెలంగాణ ఆడపడుచులు అత్యంత కోలాహలంగా ఆడుతూ పాడుతూ జరుపుకునే పండుగ బతుకమ్మ, సంబరాలను స్థానికంగా ఉన్న పి. యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వైభవంగా జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు .టి. ఉషారాణి ,ఉపాధ్యాయ బృందం కలిసి విద్యార్థినిలతో బతుకమ్మ పాటలు ,ఆటలు ఆడారు. రంగు రంగు పూలతో తీరొక్క విధంగా బతుకమ్మ ల ను పేర్చి విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో పాఠశాల కు తరలివచ్చారు. పాఠశాల ఆవరణ మొత్తం రంగులతో ,హరివిల్లు లతో అలంకరించి ఉత్సాహంగా అందరూ పాటలతో ,ఆటలాడారు. మంచిగా బతుకమ్మ లు తీసుకువచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అందరు ఉపాధ్యాయులు బృందం పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ అక్టోబర్ 9 మహా న్యూస్ :** మండల పరిధిలోని పులిగిల్ల నాతాల గూడెం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జలంధర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు అనంతరం ఎంపీడీవో జలంధర్ రెడ్డి మాట్లాడుతూ తొందరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులు హౌసింగ్ బిల్లులను పొందగలరని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కిరణ్ పంచాయతీ కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు



# సమాచార హక్కు చట్టం అమలులో జిల్లా కలెక్టర్ కు ఉత్తమ అవార్డు

- రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న హనుమకొండ కలెక్టర్

**హనుమకొండ, మహా ;** సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి సమాచార హక్కు వారోత్సవాలు 2026 కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అవార్డును అందుకున్నారు. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాకు లభించిన ఈ అవార్డు ప్రజాకేంద్రిత పాలన, పారదర్శకత, జవాబుదారితనాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ చాహత్ పాయి అన్నారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల జిల్లా కలెక్టర్ కు జిల్లా అధికారులు, పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.



# బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్

- నేరెళ్ల శారదను మర్యాదపూర్వకంగా కలిసిన గుండు సుధారాణి

**హనుమకొండ, మహా** : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ నేరెళ్ల శారద వరంగల్ కు విచ్చేసిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిత కాకతీయ హోటల్ లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్ పర్సన్, గుండు సుధారాణి నేరెళ్ల శారద ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమెతో కలిసి గుండు సుధారాణి, ఎర్రబెల్లి స్వర్ణ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.




# సమాజంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది

- రాష్ట్ర సమాచార అదనపు సంచాలకులు డిఎస్ జగన్

**హనుమకొండ, మహా** : సమాజంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని రాష్ట్ర సమాచార అదనపు సంచాలకులు డిఎస్ జగన్ అన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు సమాచార ప్రసార శాఖ అడిషనల్ డైరెక్టర్ డీఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ లను ఘనంగా సన్మానించారు. ఐ అండ్ పీఆర్ అడిషనల్ డైరెక్టర్ గా భాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా వరంగల్ నగరానికి విచ్చేసిన డీఎస్ జగన్ ను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ లు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ, పూర్వ డీపీఆర్వో మనోహరాచారి, వరంగల్ జిల్లా డీపీఆర్వో ప్రేమలత, ఖమ్మం డీపీఆర్వో గౌస్ పాషా, రిటైర్డ్ ఉద్యోగి విధుమౌళి లను ప్రెస్ క్లబ్ కు వచ్చిన సందర్భంగా శాలువా కప్పి మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ సుధాకర్, ఈసీ మెంబర్లు నయీం పాషా, అంజి, తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**క్యాతనపల్లి,మహా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రామకృష్ణాపూర్ పట్టణంలోని పలు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందడంతో పాటు, వాటిని భావితరాలకు అందించాలనే స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. ముందస్తు బతుకమ్మ వేడుకలు విద్యార్థినుల్లో ఆనందోత్సాహాలను నింపగా, పాఠశాలల్లో పండుగ సందడి నెలకొంది.

# డీజిల్ చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

- రూ.1.70 లక్షల నగదు, బాలెనో కారు స్వాధీనం



**వలిగొండ అక్టోబర్ 9 మహా న్యూస్** వలిగొండ రామన్నపేట భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన డీజిల్ చోరీ కేసులకు సంబంధించి ఒక నిందితుడిని వలిగొండ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సిఐ ఎం రవి తెలిపారు. నిందితుడి నుంచి రూ.1,70,000 నగదు, ఒక బాలెనో కారు సహా పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిఐ రవి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బోరబండ ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన సయ్యద్ సోహైల్ అలియాస్ పప్పు సోహైల్ 24ను అక్టోబర్ 9న ఉదయం అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు విచారణలో భాగంగా అతడి వద్ద నుంచి డీజిల్ చోరీకి ఉపయోగించినట్లు పేర్కొన్న వస్తువులను ధీనం చేసుకున్నారు. చోరీ కేసు ఎలా వెలుగులోకి వచ్చిందంటే. ఈ నెల 21న లోతుకుంట గ్రామానికి చెందిన లారీ యజమాని కొత్త శ్రీనివాస్ వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరి లారీలు విశాఖపట్నం నుంచి తిరిగి వచ్చిన అనంతరం సెప్టెంబర్ 20న వలిగొండలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద నిలిపి ఉంచారు మరుసటి రోజు తెల్లవారుజామున లారీల వద్దకు వెళ్లి పరిశీలించగా మూడు లారీల డీజిల్ ట్యాంకులు తెరిచి ఉండటంతో పాటు డీజిల్ చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ ఫిర్యాదుపై వలిగొండ పోలీసులు క్రైమ్ నంబర్ 251/2026, బీఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు ఐదు కేసుల్లో నిందితుడి ప్రమేయం ఉన్నట్లు పోలీసుల తెలిపిన ప్రకారం అరెస్టయిన నిందితుడికి వలిగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, రామన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక డీజిల్ చోరీ కేసుతో సంబంధం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు ఈ కేసులకు సంబంధించి మరో నలుగురు నిందితులు గణేష్ సల్మాన్ షఫీ ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు స్వాధీనం చేసుకున్న వస్తువులు రూ.1,70,000 నగదు నీలం రంగు మారుతి సుజుకి బాలెనో కారు నంబర్ ప్లేట్ TS07GW3681కారు నంబర్ ప్లేట్ ఒక ఇనుప రాడు ఒక ప్లాస్టిక్ పైపు 16 ప్లాస్టిక్ క్యాన్లు ఒక వివో మొబైల్ ఫోన్ డీజిల్‌ను ఇతర వాహనదారులకు విక్రయించడం ద్వారా సంపాదించినట్లు భావిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు అరెస్టయిన నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు పోలీసు అధికారుల పర్యవేక్షణలో దర్యాప్తు జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ పర్యవేక్షణలో చౌటుప్పల్ డివిజన్ డీఎస్పీ పి మధుసూధన్ రెడ్డి ఆదేశాల మేరకు రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం రవి వలిగొండ ఎస్సై ఎ శ్రీకాంత్ రెడ్డి మరియు హెడ్ కానిస్టేబుల్ శంకర్ వారి బృందం ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్నారు కేసును ఛేదించిన వలిగొండ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించి తగిన విధంగా పురస్కరించనున్నట్లు తెలిపారు

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలి

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి మహా :** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు.శుక్రవారం నాడు ఇందిరమ్మ మైనారిటీ మహిళాశక్తి పథకం ద్వారా బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేతుల మీదుగా మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మహిళలకు కుట్టుమిషన్ల ను బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్‌బాబు, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్, మాజీ పట్టణ అధ్యక్షులు ముచ్చల మల్లయ్య ఆధ్వర్యంలో బెల్లంపల్లి మైనార్టీ మహిళలు కుట్టు మిషన్లు పంపి పంపిణీ చేశారు. ప్రభుత్వం మైనార్టీ మహిళలకు అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళుతుంది అని మైనార్టీ మహిళా సోదరిమణులు ఆనంద వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ,మైనార్టీ నాయకులు ఎండి అసిఫ్ , ఖదీర్ మీర్జా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





# కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**మొయినాబాద్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పల్లగోల్ల మల్లేష్ యాదవ్**

**మొయినాబాద్ మహా:** ఇండియా కూటమి అగ్ర నాయకుల ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే రాజీనామా చేయించాలని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ పల్లగోల్ల మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో బాగంగా చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి దారిన సీఈసీని ఉపయోగించుకునే కేంద్ర ప్రభుత్వం మోదీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ఎన్నికల కమిషన్ జ్ఞానేష్‌ను ఉపయోగించుకున్నదని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొదటి నుండి చేస్తున్న ఆందోళన ముమ్మాటికి నిజమైందన్నారు.

# "మల్‌రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు.. రాజకీయాల్లో హుందాతనమే ముఖ్యం!"

- ఎమ్మెల్యే రంగారెడ్డిపై అసత్య ప్రచారాన్ని సహించం
- స్వార్థ రాజకీయాలకోసం మహిళలను కించపరచటం సమాజానికి సిగ్గుచేటు...
- సోషల్ మీడియా ప్రచారంపై స్పందించిన కావలి వెంకటరమణ



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 9 మహా**: ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన అంశంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పందించారు.. తనకు కూతురి వయసున్న విద్యార్థినిపై ఇలాంటి పుకారులు రావటం చాలా బాధాకరణం అని అన్నారు. పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా ఒక ప్రజాప్రతినిధిపై ఆరోపణలు చేయడం, ఒక ఆడబిడ్డను అవమానపరిచే విధంగా చేస్తూ, వాటిని రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రజాప్రతినిధి అని, ఆయనపై ప్రచారమవుతున్న అంశాన్ని వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ప్రచారాన్ని నిజమని నమ్మి ఒకరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం తగదన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి ప్రచారాలు చేయటం సరికాదని మహిళల పై అసత్య ప్రచారాలు సమాజానికి మంచిదింకాదని కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పష్టం చేశారు.




# విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మహా**:బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొన్నారు. విద్యార్థినులకు విజయదశమి,సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్) లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో కూడా పాల్గొని విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, వైస్ చైర్మన్ రవి, అధ్యాపకులు, విద్యార్థులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఆదర్శ వర్ధన్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మందమర్రిలో భవన నిర్మాణంపై నెలకొన్న సందిగ్ధం

- 15 రోజుల గడువు సమయంలో కూడా అక్రమ నిర్మాణం పనులు
- అధికారుల స్పష్టత కోసం ప్రజల డిమాండ్

**మంచిర్యాల (మహా ప్రతినిధి)**: మందమర్రి మండల రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తెలంగాణ మహిళా భవనం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం (ఫామ్‌హౌస్) గా ప్రచారంలో ఉన్న వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతులపై స్పష్టత లేదన్న వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో, అధికారులు అధికారికంగా వివరణ ఇవ్వాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం... గత ఆగస్టు 1, 2026న మందమర్రి మండల తహశీల్దార్ సతీష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, మున్సిపాలిటీ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పోలీసులు, టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా సదరు నిర్మాణ స్థలాన్ని జేసీబీ, ట్రాక్టర్లతో వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో నిర్మాణానికి సంబంధించిన పత్రాలను చూపించాలని అధికారులు కోరగా, నిర్మాణదారులు తాము 40 ఏళ్ల క్రితం నుంచే ఇక్కడే ఉంటున్నామని, పత్రాలు సమర్పించేందుకు గడువు కావాలని కోరినట్లు సమాచారం. దీంతో అధికారులు 15 రోజుల గడువు ఇస్తూ ధ్రువీకరణ పత్రాలు రాపించుకుని వెళ్లినట్లు తెలుస్తోంది.

**గడువు ముగిసినా కొనసాగిన పనులు..!?**

మండల రెవెన్యూ అధికారులు ఇచ్చిన 15 రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా అక్కడ అదనపు నిర్మాణ పనులు (బాత్రూమ్, టాయిలెట్) తదితర పనులు కొనసాగాయని సమాచారం. సదరు నిర్మాణ పనులు నిలిపివేయాలని మున్సిపాలిటీ అధికారులు సూచించినప్పటికీ, నిర్మాణదారుడు వాటిని లెక్కచేయకుండా పనులు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ నిర్మాణానికి విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటుపై కూడా సంబంధిత అధికారుల తీరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

**న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నిర్మాణదారుడు..?**

తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలను చూపించేందుకు 15 రోజుల గడువు కోరిన నిర్మాణదారుడు, ఈ వివాదానికి సంబంధించి హైదరాబాద్ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రహరీ గోడ కూల్చివేతను సవాల్ చేస్తూ, అధికారులు మళ్లీ రాకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన పిటిషన్ వేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి న్యాయస్థానం స్థానిక అధికారుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

**ప్రజల నుంచి వ్యక్తమవుతున్న ప్రశ్నలు..?**

సదరు భవనానికి మున్సిపాలిటీ నుండి లేఅవుట్ లేదా భవన నిర్మాణ అనుమతులు ఉన్నాయా..?
ఇది ప్రభుత్వ స్థలమా లేక పట్టా స్థలమా..? రెవెన్యూ రికార్డుల్లో దీని ప్రస్తుత స్థితి ఏమిటి..?
15 రోజుల గడువు ముగిసిన తర్వాత అధికారులు తదుపరి చర్యలు ఎందుకు తీసుకోలేదు..? తహశీల్దార్ కార్యాలయం, మున్సిపాలిటీ పరిధిలోని ఇతర అనధికార నిర్మాణాల విషయంలో కూడా ఇదే విధమైన తనిఖీలు ఉంటాయా..? ఈ అంశాలపై రెవెన్యూ, మున్సిపాలిటీ శాఖలు బహిరంగంగా స్పష్టత ఇస్తే, ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుందని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ ఇది అక్రమ నిర్మాణం అయితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఇది సక్రమమైనదేనని అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



# లండన్ వీధుల్లో కత్రినా కైఫ్ స్టైలిష్ లుక్

## కే బ్యూటీ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా బాలీవుడ్ భామ

మహా: బాలీవుడ్ అందాల తార కత్రినా కైఫ్ మరోసారి తన ఫ్యాషన్ శైలితో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ కే బ్యూటీ అంతర్జాతీయ ప్రస్థానంలో భాగంగా లండన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమె, ఆధునిక దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ అందాలకు ఆధునిక హంగులు జోడించినట్లుగా కనిపించిన ఆమె వేషధారణ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమం కోసం కత్రినా గోధుమ రంగు దుస్తులను ఎంచుకున్నారు. కొద్దిగా వదులుగా ఉండే జాకెట్, అదే రంగులో ప్రత్యేక డిజైన్‌తో రూపొందించిన ట్రౌజర్స్‌తో సరికొత్త రూపంలో కనిపించారు. సాధారణంగా కనిపించే ఫార్మల్ దుస్తులకు భిన్నంగా, కొత్త తరహా కటింగ్, ఆకర్షణీయమైన రూపకల్పనతో తన ప్రత్యేకతను చాటుకున్నారు. దుస్తులకు సరిపోయే నల్లటి బూట్లు, సింపుల్ యాక్సెసరీస్ ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. మేకప్ విషయంలోనూ కత్రినా సహజత్వానికి ప్రాధాన్యం ఇచ్చారు. ముఖానికి మెరుపునిచ్చే తేలికపాటి మేకప్, సహజమైన పెదవుల రంగు, అందంగా తీర్చిదిద్దిన కేశాలంకరణతో హుందాగా కనిపించారు. భారీ ఆభరణాలు, ఆడంబరమైన అలంకరణలకు దూరంగా ఉంటూనే ఆకర్షణీయమైన రూపాన్ని ప్రదర్శించారు. కత్రినా కైఫ్ సినిమాల్లో నటిగా గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు సౌందర్య ఉత్పత్తుల రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. కే బ్యూటీ బ్రాండ్‌ను విస్తరించే క్రమంలో విదేశీ మార్కెట్లపై దృష్టి సారించడం ఆమె వ్యాపార ప్రయాణంలో మరో ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది. లండన్ కార్యక్రమంలో ఆమె ప్రదర్శించిన దుస్తుల శైలి, మేకప్ తీరు ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి.



# ఓటీటీ కోసం 'ది ప్యారడైజ్'లో మార్పులు!

**నాని ఆధ్వర్యంలో రీ ఎడిటింగ్.. కొత్త పాట, భావోద్వేగ సన్నివేశాలు జోడించే అవకాశం**

**హైదరాబాద్, మహా:** నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'ది ప్యారడైజ్' సినిమా ఓటీటీ విడుదలపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన రావడంతో, డిజిటల్ వెర్షన్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఓటీటీ కోసం సినిమాను మరోసారి ఎడిట్ చేస్తున్నారనే వార్త ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. థియేటర్లలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనను దృష్టిలో ఉంచుకుని కథనం మరింత ఆసక్తికరంగా ఉండేలా కొన్ని సన్నివేశాల్లో మార్పులు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సినిమా నిడివి, కథనం వేగం, భావోద్వేగ సన్నివేశాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ మార్పులపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేట్రికల్ వెర్షన్‌లో చోటు దక్కని ఓ పూర్తి పాటను ఓటీటీ వెర్షన్‌లో చేర్చే అవకాశం ఉందని సమాచారం. అంతేకాకుండా పాటలకు సంబంధించిన కొన్ని భావోద్వేగ సన్నివేశాలను కూడా జోడించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మార్పులు అమలైతే థియేటర్లలో చూసిన ప్రేక్షకులకు కూడా డిజిటల్ వెర్షన్‌లో కొత్త అనుభూతి కలిగే అవకాశం ఉంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కలయికలో వచ్చిన ఈ చిత్రంపై విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి. నాని పాత్ర, కథా నేపథ్యం, చిత్రంలోని సాంకేతిక అంశాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి కనిపించింది. ఇప్పుడు ఓటీటీ వెర్షన్‌లో చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్న మార్పులు సినిమాపై మళ్లీ చర్చకు దారితీశాయి. అయితే రీ ఎడిటింగ్, కొత్త పాట చేర్పు వంటి అంశాలపై అధికారిక స్పష్టత వచ్చే వరకు వీటిని ప్రచారంలో ఉన్న సమాచారంగానే పరిగణించాలి. ఓటీటీ విడుదల తేదీ, తుది వెర్షన్‌లో ఉండే మార్పులపై చిత్ర బృందం ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





# చిరంజీవి గ్రీన్ సిగ్నల్ కోసం దర్శకుల ఎదురుచూపులు

**మెగాస్టార్ తదుపరి సినిమా ఎవరితో? బుచ్చిబాబు నుంచి కార్తీక్ సుబ్బరాజ్ వరకు ఆసక్తికర చర్చ**

హైదరాబాద్, మహా: మెగాస్టార్ చిరంజీవి తదుపరి సినిమా ఎవరితో ఉండబోతుందనే అంశంపై టాలీవుడ్‌లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్న చిరంజీవి, ఆ తర్వాత ఏ దర్శకుడితో పనిచేస్తారనే దానిపై సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పలువురు దర్శకులు తమ కథలతో మెగాస్టార్‌ను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బాబీ దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సినిమా పూర్తయిన తర్వాత చిరంజీవి కొత్త ప్రాజెక్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో చిరంజీవి చేయాల్సిన సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందనే ప్రశ్న కూడా అభిమానుల్లో నెలకొంది. ఈ చిత్రాన్ని నాని నిర్మించాల్సి ఉండగా, 'ది ప్యారడైజ్' నిర్మాణం ఆలస్యం కావడంతో ప్రాజెక్టు ప్రణాళికల్లో మార్పులు వచ్చినట్లు సమాచారం. అయితే ఈ సినిమా నిలిచిపోయిందనే ప్రచారంపై అధికారిక స్పష్టత లేదు. చిరంజీవి తదుపరి సినిమా కోసం బుచ్చిబాబు సానా, గోపీచంద్ మలినేని, అనిల్ రావిపూడి, హరీశ్ శంకర్ వంటి దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. తమ కథలకు మెగాస్టార్ ఆమోదం పొందేందుకు వారు ప్రయత్నిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రతి దర్శకుడు చిరంజీవి ఇమేజ్‌కు సరిపోయే కథతో పాటు అభిమానులు కోరుకునే మాస్ అంశాలు, భావోద్వేగాలు, వినోదానికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ కూడా చిరంజీవిని కలిసి కథ వినిపించినట్లు వార్తలు వస్తున్నాయి. విభిన్నమైన కథాంశాలు, ప్రత్యేకమైన కథనంతో గుర్తింపు పొందిన ఆయన దర్శకత్వంలో చిరంజీవి సినిమా చేస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. అయితే ఈ కథకు మెగాస్టార్ ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని సమాచారం. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులపై వస్తున్న వివరాల్లో కొన్ని పరిశ్రమ వర్గాల ప్రచారాలే కావడంతో అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. చిరంజీవి తన తదుపరి చిత్రానికి ఎవరిని ఎంపిక చేసుకుంటారనే అంశం టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. మెగాస్టార్ నిర్ణయం వెలువడితేనే తదుపరి సినిమా దర్శకుడిపై స్పష్టత రానుంది.



# హాఫ్ శారీలో పాయల్ రాజ్‌పుత్ సందడి

సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన అందాల భామ.. అభిమానులను ఆకట్టుకుంటున్న లుక్ హైదరాబాద్, మహా: తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పాయల్ రాజ్‌పుత్ తన సంప్రదాయ వస్త్రధారణతో మరోసారి ఆకట్టుకుంటున్నారు. ఆధునిక ఫ్యాషన్‌తో పాటు భారతీయ సంప్రదాయ దుస్తులపైనా ఆసక్తి చూపించే ఈ భామ, హాఫ్ శారీ లుక్‌లో ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. ఈ తరహా వస్త్రధారణ యువతుల్లోనూ ఆదరణ పొందుతున్న నేపథ్యంలో పాయల్ లుక్ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. హాఫ్ శారీ అనేది సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే దుస్తుల శైలి. లంగా, జాకెట్, అందుకు సరిపోయే ఓణీ కలయికతో రూపొందే ఈ వస్త్రధారణ మహిళలకు ప్రత్యేకమైన రూపాన్ని అందిస్తుంది. పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు, కుటుంబ వేడుకల సమయంలో ఈ దుస్తులకు మంచి ఆదరణ ఉంటుంది. సంప్రదాయ హంగులను ఆధునిక డిజైన్లతో కలిపి ధరించడం ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో ప్రత్యేకతగా మారింది. పాయల్ రాజ్‌పుత్ తన ఫ్యాషన్ ఎంపికలతో తరచూ అభిమానులను ఆకట్టుకుంటుంటారు. చీరలు, ఆధునిక దుస్తులతో పాటు సంప్రదాయ లుక్స్‌లోనూ కనిపిస్తూ తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. దుస్తులకు అనుగుణంగా మేకప్, కేశాలంకరణ, ఆభరణాలను ఎంచుకోవడం మొత్తం రూపానికి మరింత ఆకర్షణను తీసుకొస్తుంది. ఆమె ఫొటోలను అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిగా వీక్షిస్తున్నారు. 'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న పాయల్ రాజ్‌పుత్, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. 'వెంకీ మామ', 'డిస్కో రాజా', 'మంగళవారం' వంటి చిత్రాలతో తన నటనా ప్రయాణాన్ని కొనసాగించారు. వెండితెరపై నటనతో పాటు ఫ్యాషన్ ఎంపికలతోనూ వార్తల్లో నిలుస్తున్న పాయల్, సంప్రదాయ అందాలకు ఆధునికతను జోడిస్తూ అభిమానులను అలరిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com